

ఆరోగ్యానికి రక్ష టీకా

- వ్యాక్సినేషన్‌తో ఎన్నోరకాల వ్యాధులకు అడ్డుకట్ట
- శరీరంలో వ్యాధి నిరోధక శక్తి అభివృద్ధి
- నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల అవగాహన దినోత్సవం




- 8వ పేజీలో

ప్రణవ్‌గోపాల్‌కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ పీఠం

విశాఖ టీడీపీ నేతలకు కార్పొరేషన్ పదవులు



ప్రణవ్‌గోపాల్



గండి బాబ్జీ



సీతంరాజు సుధాకర్

ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా గండి బాబ్జీ

- ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ చైర్మన్‌గా సీతంరాజు సుధాకర్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు నేతలకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ఇచ్చింది. విశాఖ జిల్లా నుంచి పదవులు దక్కిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఉన్నారు. ఉత్తరాంధ్రలో అత్యంత కీలకమైన విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) చైర్మన్‌గా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మానం వెంకట ప్రణవ్‌గోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్‌గా సీతంరాజు సుధాకర్ నియమితులయ్యారు.



పార్టీ కార్యాలయంలో ప్రణవ్‌గోపాల్‌ను అభినందిస్తున్న కార్యకర్తలు

ప్రణవ్‌గోపాల్..

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా నియమితులైన మానం వెంకట ప్రణవ్‌గోపాల్ తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. బీబీఎం చేసి తరువాత మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ చేసిన ప్రణవ్ సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత తెలుగుదేశం అనుబంధ విద్యార్థి సంఘం టీఎన్ఎస్ఎఫ్‌లో చేరి తొలుత జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తరువాత 2020లో రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. తాడేపల్లిలో నాటి సీఎం జగన్ ఇంటిని ముట్టడికి యత్నించిన కేసులో పది రోజులపాటు జైలు జీవితం అనుభవించారు. అలాగే రుషికొండ ప్యాలెస్ ముట్టడి కేసులో ఆరిలోవ పోలీసులు కేసు నమోదుచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు సంబంధించి ఆయనపై పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో కీలక బాధ్యతలు నిర్వహించి అటు లోకేశ్, ఇటు చంద్రబాబునాయుడు దృష్టిని ఆకర్షించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పార్టీ కార్యాలయంలో 72 గంటల ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో పార్టీ అధికారంలోకి రావడంతో కీలకమైన వీఎంఆర్‌డీఏ చైర్మన్ పదవి వరించింది. అవివాహితుడైన ప్రణవ్‌గోపాల్ వయస్సు 34 సంవత్సరాలు.

గండి బాబ్జీ

ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జీ స్వస్థలం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం మొగలిపురం. ఆయన కాంగ్రెస్‌తో రాజకీయ జీవితం ప్రారంభించారు. 2004లో పరవాడ ఎమ్మెల్యేగా ... మిగతా 6వ పేజీలో

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో మరో ఐదుగురికి...

- కొప్పల వెలమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పీవీజీ కుమార్
- గవర కార్పొరేషన్ చైర్మన్‌గా మళ్ల సురేంద్ర
- రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రగడ నాగేశ్వరరావు
- జీసీసీ చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్
- ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్‌గా దొన్నుదొర



పీవీజీ కుమార్



మళ్ల సురేంద్ర



ప్రగడ నాగేశ్వరరావు

విశాఖపట్నం, నవంబరు 9 : ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం ఎనిమిదిమందిని పదవులు వరించాయి. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌ను రాష్ట్ర కొప్పల వెలమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా, ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా, అనకాపల్లికి చెందిన టీడీపీ బీసీ విభాగం నేత మళ్ల సురేంద్రను గవర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. అలాగే అల్లూరి జిల్లాలో అరకులోయ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌ను గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా, అరకులోయ అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొరను ఆర్టీసీ ప్రాంతీయ (విజయనగరం జోన్) చైర్మన్‌గా నియమించింది.



కిడారి శ్రావణ్‌కుమార్



దొన్నుదొర

ఉక్కుకు పొంచి ఉన్న ముప్పు


ఒకవైపు నియామకాలు నిలిపివేత...

- మరోవైపు భారీగా ఉద్యోగాలు కోత
- ఇంకొక వైపు తెరపైకి వీఆర్ఎస్
- దేశంలో అతి తక్కువ ఉద్యోగులు ఉన్నది విశాఖ ఉక్కు కర్మాగారంలోనే...
- పూర్తిస్థాయిలో ప్లాంటు నడపాలంటే భవిష్యత్తులో కష్టమే
- కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదొకటి.. చేస్తున్నదొకటి
- చేజేతులా నష్టాల్లో నెట్టి ప్రైవేటీకరించేందుకు యత్నిస్తోందని కార్మిక వర్గాల ఆందోళన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటుపై కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు...చేస్తున్న పనులకు పొంతన కుదరడం లేదు. ఉత్పత్తి వ్యయం తగ్గింపు పేరుతో ఉద్యోగుల సంఖ్యను కుదించుకుంటూ పోతోంది. కొత్త నియామకాలను నాలుగేళ్లుగా నిలిపివేసింది. మరోవైపు ప్రతి నెలా వంద మందికి పైగా పదవీ విరమణ చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు చత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు ఇటీవల రెండు వందల మందిని డిప్యుటేషన్‌పై పంపించింది. తాజాగా స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) అమలు చేస్తామని సర్వే నిర్వహించింది. జీతాలు సక్రమంగా ఇవ్వకుండా వేధిస్తున్న ప్లాంటులో పనిచేయడం అవివేకమని భావించి రెండు వేల మంది వీఆర్ఎస్ తీసుకోవడానికి సుముఖత వ్యక్తంచేశారు.

ప్రస్తుతం విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో ఎగ్జిక్యూటివ్‌లు 4,002 మంది, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 8,530 మంది కలిపి మొత్తం 12,532 మంది ఉన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఐదు వేల మంది పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఉద్యోగుల సంఖ్య ఏడు వేలకు పడిపోనుంది. ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులు. ప్రస్తుతం మిలియన్ టన్నుకు 1,717 మంది ఉద్యోగులు ఉండగా, నాలుగేళ్ల తరువాత అంటే 2029 నాటికి వేయి మంది మాత్రమే ఉంటారు. ఇది చాలా తక్కువ. బిలాయ్‌లో ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంటు నడుస్తోంది. దాని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఏడు మిలియన్ టన్నులు. అక్కడ ... మిగతా 6వ పేజీలో



దేశంలో ప్రభుత్వ స్టీల్‌ప్లాంట్లలో అక్టోబరు, 2024 నాటికి ఉద్యోగుల సంఖ్య

ప్లాంటు	ఉత్పత్తి సామర్థ్యం	ఎగ్జిక్యూటివ్‌లు	నాన్ ఎగ్జిక్యూటివ్‌లు	మొత్తం	మి.టన్నుకు
విశాఖ స్టీల్	7.3 మి.టన్నులు	4,002	8,530	12,532	1,717
బిలాయ్	7 మి.టన్నులు	2,675	11,615	14,290	2,041
రూర్కెలా	4 మి.టన్నులు	1,937	10,265	12,202	3,051
బొకారో	4 మి.టన్నులు	2,157	9,810	11,967	2,992
బర్నాపూర్	2.5 మి.టన్నులు	1,017	3,774	4,791	1,916
దుర్గాపూర్	2.2 మి.టన్నులు	1,257	6,167	7,424	3,375

సౌండ్ సైలెన్సర్లు ధ్వంసం

- మాడిఫైడ్ సైలెన్సర్లతో శబ్ద కాలుష్యం వెదజల్లితే చట్టపరంగా చర్యలు
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ హెచ్చరిక

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాహన సైలెన్సర్లు మార్చి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్న యువకులపై నగర పోలీసులు కొరడా ఝులిపించారు. వాహనాల తయారీ కంపెనీ ఇచ్చిన సైలెన్సర్ కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకుని కొందరు నగరంలో తిరిగుతున్నారు. ఆయా వాహనాలు రోడ్లపై వెళుతుంటే భారీ శబ్దం వెలువడుతుంది. దీంతో గుండెజబ్బులు ఉన్నవారు, చిన్నారులు, వృద్ధులు ఆందోళనకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో నగర పోలీసులు ఇటీవల స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి ... మిగతా 6వ పేజీలో



బీచ్‌రోడ్డులో మాడిఫైడ్ సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

మళ్లీ తెరపైకి కోస్టల్ కారిడార్


- కంటెయినర్ టెర్మినల్ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ
- 55 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో రహదారి
- ప్రాజెక్టు వ్యయం రూ.6,289 కోట్లు
- రూ.1.45 కోట్లతో తయారవుతున్న డీపీఆర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖపట్నం జిల్లా అధికారులతో ఇటీవల నిర్వహించిన సమీక్షతో పాత ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ మళ్లీ తెరపైకి వచ్చాయి. ఇందులో కోస్టల్ కారిడార్ ఒకటి. జాతీయ రహదారి-16కి సమాంతరంగా విశాఖపట్నం పోర్టు కంటెయినర్ టెర్మినల్ నుంచి భోగాపురం విమానాశ్రయం జాతీయ రహదారి-16 వరకు ఆరు వరుసల్లో కోస్టల్ కారిడార్ నిర్మించాలనేది ప్రతిపాదన. గత ఏడాదే దీనికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయాలని భారత జాతీయ రహదారుల సంస్థకు రూ.1.45 కోట్లు మంజూరు చేశారు. దీనిని త్వరగా పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.



విశాఖపట్నం పోర్టు కంటెయినర్ టెర్మినల్ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు తీరాన్ని ఆనుకొని 55 కి.మీ. పొడవున ఆరు వరుసల్లో కారిడార్ నిర్మించాలనేది ప్రణాళిక. దీనికి రూ.6,289 కోట్లు అవసరం అని అంచనా వేశారు. కారిడార్‌లో రెండు వైపులా పది మీటర్ల గ్రీన్ బెల్ట్ నిర్వహించాలని ప్రతిపాదించారు. లాజిస్టిక్ పార్కులు, పర్యాటక ఆకర్షక ప్రాజెక్టులు ఇందులో భాగం చేయాలని సీఎం సూచించారు. భీమిలి నుంచి భోగాపురం మధ్య ఈ కారిడార్ కోసం 346 ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని లెక్క తేల్చారు. కంగవానిపాలెం, అన్నవరం, మూలకద్దు, ఆ పొరుగునే ఉన్న మరో ఆరు గ్రామాల్లో ఈ భూసేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అప్పట్లో జరిగిన చర్చల మేరకు ... మిగతా 6వ పేజీలో



ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురి ఎంపిక



నాగేశ్వరరావు



రాజేంద్రప్రసాద్



రాజారావు

భీమునిపట్నం రూరల్/పెదగంట్యాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా విశాఖ జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరు సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో భీమిలి మండలం చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పక్కి నాగేశ్వరరావు, పెదగంట్యాడ మండలం గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల+2లో కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు పాలగుమ్మి రాజారావు, ఎస్జీటీ కేటగిరీలో భీమిలి మండలం ముద్దాడపేట ఎంపీపీ స్కూల్‌కు చెందిన సువ్వారు రాజేంద్రప్రసాద్ అవార్డులకు ఎంపికయ్యారు.

నేవీ డే ఈసారి పూరీలో...

- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- తూర్పు నౌకాదళం విశాఖలో కాకుండా బయట నిర్వహించడం ఇదే ప్రథమం

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏటా డిసెంబరు 4న తూర్పు నౌకాదళం విశాఖపట్నంలో నిర్వహించే నేవీ డే కార్యక్రమాలను ఈసారి ఒడిశాలోని పూరీలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున నౌకాదళంలోని అన్ని విభాగాలు తీరంలో సాహస విన్యాసాలు నిర్వహించడం ఆనవాయితీ. ముఖ్యంగా వైమానిక దళం ఆకాశంలో చేసే అద్భుతాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. భారత రాష్ట్రపతి, త్రివిధ దళాల అధిపతి ద్రౌపదీ ముర్ము ఒడిశా రాష్ట్రానికి చెందినవారు కావడంతో ఆమె పూరీలో జరిగే నేవీ డేకి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రమైన విశాఖలో కాకుండా వేరే ప్రాంతంలో నేవీ డే విన్యాసాలు నిర్వహించడం ఇదే ప్రథమం. గత ఏడాదే దీనికి బీజం పడింది. పశ్చిమ నౌకాదళం కేంద్రమైన ముంబైలో ఏటా నేవీ డే నిర్వహించేవారు. గత ఏడాది ఛత్రపతి శివాజీ ప్రాంతమైన సింధు దుర్గ్‌లో నేవీ విన్యాసాలు నిర్వహించారు. వాటికి దేశ ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసారి దానిని తూర్పు నౌకాదళంలో అమలులోకి తీసుకువచ్చారు. ఉత్తరాంధ్ర, ఒడిశా అంతా గతంలో కళింగ సామ్రాజ్యంగా వ్యవహరించేవారు. అందులో గిరిజనుల పాత్ర కీలకం. ఒడిశా కూడా తూర్పు నౌకాదళంలో భాగమే కాబట్టి అక్కడ రాష్ట్రపతి కోసం నేవీ విన్యాసాలు నిర్వహిస్తున్నారు. నేవీ డే సందర్భంగా ప్రధాన నగరాల్లో ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటుచేయడం ఆనవాయితీ. తూర్పు నౌకాదళం కోల్‌కతా, పారదీప్, పాండిచ్చేరి, చెన్నై వంటి నగరాలకు యుద్ధనౌకలను, హెలికాప్టర్లను పంపించి, అక్కడి పౌరులకు వాటిని సందర్శించే అవకాశం కల్పిస్తుంది. ఈసారి ప్రధాన కేంద్రమైన విశాఖలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. నౌకాదళంలోని నౌకలు, విమానాలు, హెలికాప్టర్లు, సబ్‌మెరైన్లు అన్నీ పూరీ వెళతాయని నేవీ వర్గాలు తెలిపాయి.



తుమురుగెడ్డ రహదారిలో యువకుల బైక్ రేస్

మధురవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం ఏపీహెచ్‌బీ కాలనీ సమీపంలో ఉన్న తుమురుగెడ్డ జలాశయం రహదారిలో కొందరు యువకులు బైక్ రేస్‌లతో వీరంగం సృష్టిస్తున్నారు. రిజర్వాయర్ సమీపంలో ఉన్న ఈ రహదారిపై నుంచి శంభువానిపాలెం గిరిజనులు రాకపోకలు చేస్తుంటారు. ఈ రోడ్డులో యువకులు బైక్ రేస్‌లు నిర్వహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మరి కొందరు యువకులు జలాశయంలో ఈత పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. గతంలో ఈ జలాశయంలో ఈతకు దిగిన పలువురు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. జలాశయం ముందు శంభువానిపాలెం రహదారిపై గతంలో అటవీ శాఖ చెక్ పోస్టు ఉండేది. కరోనా తరువాత చెక్ పోస్టును ఎత్తివేశారు. దీంతో యువకులు రెచ్చిపోతున్నారు. అలాగే రాత్రివేళల్లో కొందరు ఈ ప్రాంతంలో మద్యం సేవిస్తున్నట్టు తెలిసింది. పోలీసులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

రామాయణం.. విజయానికి మార్గదర్శకం

సాగర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి రచించిన రామాయణం విజయానికి మార్గదర్శకమని శ్రీరామ సేవా సమితి వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఉలిమిరి వెంకట సోమయాజులు అన్నారు. శనివారం ఆయన రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలో వాల్మీకి రామాయణం నుంచి నిర్వహణ చిట్కాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడారు.విజయానికి తెలివి, బుద్ధి బలం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఏకాగ్రత ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బోస్, తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలను నియంత్రించాలి : సీపీఎం

తగరపువలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తక్షణమే నిత్యావసర సరకుల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు తగరపువలసలో ఉన్న రేషన్ డిపోల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు.దేశంలో ఏ రాష్ట్రంలోనూ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, వేధింపులు ఎక్కువయ్యాయన్నార. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, రీసు నరసింగరావు, ముగడ ఈశ్వరరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : నిత్యావసర సరకుల ధరలను విపరీతంగా పెంచుతున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా ప్రజల ఆదాయం పెంచడం లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కుమార్ విమర్శించారు. శనివారం సీపీఎం నాయకులు కొత్తపరదేశిపాలెంలో పాదయాత్ర చేసి, ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి. అప్పలరాజు, కొండమ్మ, భారతి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవం పురస్కరించుకుని తాటితూరులో విద్యార్థులు శనివారం మార్చ్‌పాస్టు నిర్వహించారు. స్కౌట్స్ ఉపాధ్యాయుడు ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ సేవల గురించి స్థానికులకు వివరించారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పాఠశాల చైర్మన్ సుంకరి రవీంద్ర

మధురవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు విద్యార్థుల్లో శారీరక ఉల్లాసం కలిగిస్తాయని స్థానిక గ్రీన్ డేల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ సుంకరి రవీంద్ర అన్నారు. శనివారం ఆ పాఠశాలలో క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి చైర్మన్‌తో పాటు పాఠశాల కరస్పాండెంట్ విజయా రవీంద్ర బహుమతులు అందజేశారు.

సీపీఎం 'ప్రజా పోరు'

పద్మనాభం (రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8 నుంచి ప్రజా పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు తెలిపారు. శనివారం ఆయన ఏనుగులపాలెం, మునివానిపాలెం, సామయ్యవలస గ్రామాల్లో జరిగిన ప్రజా పోరు కార్యక్రమంలో మాట్లాడారు.

గ్రామైక్య సంఘాల సహాయకులతో సమావేశం

పద్మనాభం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామైక్య సంఘాల సహాయకులు (వీఏఏ) ఎస్‌హెచ్‌జీ ఇన్‌కమ్ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల సమగ్ర సమాచారం సేకరణకు సర్వే చేపట్టాలని డ్వామా సీఈఓ వీరపాండ్యన్ చెప్పారు. శనివారం ఆయన వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల సహాయకులతో జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాలను ప్రారంభించినప్పటి నుంచి సభ్యులకు ప్రభుత్వం అందించిన రుణాల గురించి సమాచారం సేకరించాలన్నారు. సమావేశంలో ఏపీఎం సాయి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పనులు వేగవంతం కావాలి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- దేవస్థానం అధికారులతో సమీక్ష



కలెక్టర్‌కు మాస్టర్ ప్లాన్ గురించి వివరిస్తున్న దేవస్థానం ఈఓ త్రినాథరావు

సింహాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ప్రసాద్ పథకం కింద పర్యాటక శాఖ, దేవదాయశాఖ సంయుక్తంగా చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈమేరకు కల్యాణ మండపం, బస్టాండ్ ఆధునికీకరణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై మ్యాప్ ప్రకారం అడిగి తెలుసుకున్నారు. భక్తులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస వసతులు కలిపించేందుకు ప్రసాద్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతున్న పనుల స్థితిగతులు, తరువాత చేపట్టనున్న పనులను కలెక్టర్‌కు ఈఓ వివరించారు.

కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ద్వారకా పోలీసుస్టేషన్ పరిధిలోని సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సత్యప్రియ (31), ఇల్లిశెట్టి కార్తికేయ (32) నివాసం ఉంటున్నారు. వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. కార్తికేయకు కట్న కానుకల కింద రూ. 4. 5 కోట్లు, బంగారం, పెళ్లి ఖర్చుల కింద రూ. కోటి ఇచ్చారు. కొద్దిరోజులుగా సత్యప్రియపై భర్త కార్తికేయతో పాటు అత్తమామ వేధింపులు మొదలయ్యాయి. ఆమెను అనుమానించడమే కాకుండా అదనపు కట్నం కావాలని వేధించడం మొదలుపెట్టారు. దీంతో కొద్ది రోజుల క్రితం సత్యప్రియ తల్లికి ఫోన్ చేసి తన బాధను తెలిపింది. వేధింపులు అధికమవడంతో శుక్రవారం ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త పడక గదిలో సత్యప్రియ ఉరేసుకుని ఉండడం చూసి తల్లిదండ్రులకు చెప్పాడు. సత్యప్రియ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లికి సమీప బంధువులు ఫోనులో సమాచారం అందించారు. తమ కుమార్తె మృతికి అల్లుడు, వారి తల్లిదండ్రులే కారణమని ద్వారకా పోలీసులకు మృతురాలి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేపట్టారు. శనివారం కార్తికేయను, అతని తల్లిదండ్రులు శైలజ, సూర్యచంద్రరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

తగరపువలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులను ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు శనివారం తనిఖీ చేవారు. ఈ సందర్భంగా ఆయన బస్సుల డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వేగ నియంత్రణ పాటించాలని, ప్రతి బస్సులో సహాయకులు ఉండాలని, మద్యం తాగి బస్సులు నడపరాదని సూచించారు.

రంగనాథస్వామి ఆలయ భూములపై అనుకూలంగా కోర్టు తీర్పు

ఆనందపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిలోవ రంగనాథస్వామి ఆలయ భూములకు సంబంధించి హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఈఓ ఎస్. నానాజీబాబు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 69లో ఆలయానికి చెందిన 26. 25 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వాటిపై 15 ఏళ్ల క్రితం హైకోర్టులో రెండు పిటీషన్లు వేశారని, అడ్వకేట్ ఎన్‌వీఎస్ ప్రసాద్ వర్మ దేవస్థానం తరఫున వాదనలు వినిపించారని చెప్పారు. కోర్టు పిటీషన్లు కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. రూ. 60 కోట్ల విలువైన భూమి దేవస్థానానికి దక్కిందన్నారు. తక్షణమే భూములను తమ ఆధీనంలోకి తీసుకుని బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రోగులకు రూ. పది వేల ఆర్థిక సహాయం

కొమ్మాది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :ఆరో వార్డులోని ఆర్‌హెచ్ కాలనీలో అంగ వైకల్యంతో మంచానికి పరిమితమైన ఇద్దరు వ్యక్తులకు టీడీపీ వార్డు మాజీ అధ్యక్షుడు,సూర్య కనస్ట్రక్షన్స్ అధినేత వాండ్రాసి అప్పలనాయుడు శనివారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, రామకృష్ణ, బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాక్షినగర్ పీఎస్‌ను సందర్శించిన కలెక్టర్

విశాలాక్షినగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శనివారం సందర్శించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కేంద్రంలో సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు రెవెన్యూ ఎన్నికల విభాగం అధికారులు, బీఎల్‌ఓలు ఉన్నారు.

రోడ్ల మరమ్మతుకు చర్యలు : జడ్సీ సింహాచలం

మధురవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని రోడ్లు, కాలువల మరమ్మతుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని జోన్-2 జడ్సీ సింహాచలం తెలిపారు. శనివారం ఆయన వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పిళ్లా మంగమ్మ విజ్ఞప్తి మేరకు వార్డులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, కార్యదర్శి కానూరి అచ్యుతరావు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

- టీడీపీ శ్రేణులకు గంటా రవితేజ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న గంటా రవితేజ

భీమునిపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, వార్డు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కోట్ని బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పల నరసింహరాజు, జీవన్‌కుమార్, దామోదరరావు పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. తొలుత భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం అష్టోత్తర శతనామార్చనలు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

'సాహితీ ప్రవీణ' పుస్తకావిష్కరణ

భీమునిపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు దొడ్డి ప్రవీణ రచించిన సాహితీ ప్రవీణ పుస్తకాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాహితీ ప్రవీణలోని అంశాలు సమాజానికి మనోవికాసం కలిగించేలా వున్నాయని రచయితను అభినందించారు.వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి మాట్లాడుతూ పుస్తకంలోని వ్యాసాలు ప్రాచీనం నుంచి ఆధునిక సాహిత్యం వరకూ అనేక కోణాల్లో సమాజాన్ని చూపించాయని కొనియాడారు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం

పద్మనాభం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త కొవ్వాడ గ్రామంలో పోలీసులు శనివారం 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన బత్తుల ఎల్లమ్మ వద్ద 19, అరిపాక వరలమ్మ దగ్గర 9 బాటిళ్లు పట్టుకున్నామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ

ఎండాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేసిన 8వ వార్డు పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ లొడగల అప్పారావు వార్డు కార్యాలయం ఆవరణలో శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేశ్‌కుమార్, జోన్ -2 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. కిశోర్, శానిటరీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రణవ్‌గోపాల్‌కు అభినందనలు



ప్రణవ్ గోపాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎండాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా నియమితులైన ప్రణవ్ గోపాల్‌ను 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు కలిసి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకుడు చిన గోపి, తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హవనం

సింహాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి చెందిన కొండ దిగువ పూదోటలోని పద్మావతి, అలిమేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సుదర్శన హవనం శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే స్వామివారి ఆవిర్భావ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ఆర్జిత సేవగా సుదర్శన హవనాన్ని నిర్వహిస్తుంటారు.

కారులో నుంచి మంటలు

సింహాచలం, నవంబరు 9 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుల కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన ప్రకారం అప్పన్న దర్శనానికి కొండదిగువ నుంచి సింహగిరికి చేరుకున్న భక్తుల కారులో నుంచి ఆకస్మాత్తుగా దట్టమైన మంటలు రావడాన్ని గమనించిన కారు డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. వెంటనే కారులో ఉన్న వారిని కిందకి దింపేసి వెనుక డిక్కీలో నుంచి మంటలు రావటాన్ని గుర్తించాడు. స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేయడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

మళ్లీ తెరపైకి కోస్టల్ కారిడార్

... 5వ పేజీ తరువాయి

కొన్ని అంగీకారాలు కుదిరాయని అధికారులు చంద్రబాబుకు వివరించారు.

- ఈ ప్రాజెక్టుకు భూ సేకరణకు రూ.4,315 కోట్లు, నిర్మాణాలకు రూ.1,974 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు.
- భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,200 కోట్లు భరించడానికి ఒప్పుకొంది. మిగిలిన మొత్తం కేంద్రం పెట్టుకోవాలి.
- నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీ మినహాయింపు

త్వరలోనే డీపీఆర్ పూర్తి

ఈ కోస్టల్ కారిడార్ డీపీఆర్‌కు గత ఏడాది ఆగస్టులోనే రూ.1.45 కోట్లు మంజూరుచేశారని, ప్రస్తుతం డీపీఆర్ తయారు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి చేసి కేంద్రానికి సమర్పిస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఇది పూర్తయితే కేంద్ర ప్రతినిధులతో చర్చించి, ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళతామని సీఎం పేర్కొన్నారు. ఇదిలావుండగా వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం విశాఖలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ఈ ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని నాటి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇందులో భీమునిపట్నం నుంచి భోగాపురం వరకు 19.66 కి.మీ. పొడవున గ్రీన్ ఫీల్డ్ కారిడార్ వేయాలని నిర్ణయించారు. అయితే భీమిలి తీరం మీదుగా ఈ కారిడార్ వెళ్లాల్సి ఉండగా పట్టణంలో పురాతన కట్టడాలు కూల్చాల్సి వస్తుందని చెప్పి కారిడార్ మలుపు తిప్పారు. ఈ మార్గంలో వైసీపీ నాయకులు కొన్ని వందల ఎకరాలు సొంతం చేసుకున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు సహకరించాలని వినతి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలసలో నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు సహాయ, సహకారాలు అందించాలని ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు డీఈఓ పి. ప్రేమ్‌కుమార్‌ను కోరారు. శనివా రం వారు జిల్లా విద్యా శాఖ కార్యా లయంలో డీఈఓను కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి రేఖ అప్పారావు మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పా రు. దాతల సాయంతో విద్యార్థులకు విద్యా సామగ్రి, పుస్తకాలు, అల్పాహారం సమకూరుస్తున్నామన్నారు. విద్యా శాఖ తరఫున కూడా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతనిధులు గంటాన మోహనరావు, జీవీ అప్పారావు, గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగ అవకాశాలపై పలు పరిశ్రమల నిర్వాహకులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విజిల్, మౌరిటెక్, ఫినోమ్యాపిల్, కాంప్రాన్ వంటి ఏడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగావకాశాల కోసం కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులు వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, ప్లేస్‌మెంటు అధికారులు శ్రీనివాసరావు, రూప్ సుందర్, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సైలెన్సర్లు ధ్వంసం

... 5వ పేజీ తరువాయి

182 వాహనాలకు ఉన్న మాడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటినీ శనివారం బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయం ఎదురుగా రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఇలాంటి మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగించడం మోటారు వాహనాల చట్టం-1998 సెక్షన్ 190 ప్రకారం నేరమన్నారు.మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలతో పట్టుబడితే మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ.పది వేలు జరిమానా విధిస్తారన్నారు. రెండోసారి పట్టుబడితే వాహనం సీజ్ చేసి, వాహనం నడిపేవారి లైసెన్స్‌ను ఆరు నెలలు సస్పెండ్ చేయడంతోపాటు మూడు నెలలు జైలు శిక్ష, రూ.పది వేల జరిమానాకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా సెప్టెంబరు ఒకటి నుంచి హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన 70,500 మంది లైసెన్స్‌లను మూడు నెలలు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాల్సిందేనని సీపీ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజితా వేజెండ్ల, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఉక్కుకు పొంచి ఉన్న ముప్పు

... 5వ పేజీ తరువాయి

ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 14,290 మంది ఉన్నారు. అంటే మిలియన్ టన్నుకు 2,041 మంది ఉన్నారు. విశాఖ స్టీల్‌తో పోలిస్తే మిలియన్ టన్నుకు 300 మంది ఎక్కువ ఉన్నారు. పైగా ఏటా 250 మందిని కొత్తగా తీసుకుంటున్నారు.

లాభాలు ఎలా వస్తాయి?

సెయిల్‌తో సమానంగా లాభాలు తీసుకురావాలని, దీనికి కార్మికులు తీవ్రంగా కృషిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సెయిల్‌కు సొంత గనులు ఉన్నాయి. నిధులకు కొరత లేదు. ఉద్యోగుల సంఖ్య అవసరమైనంత ఉంది. పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే లాభాలు వస్తున్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితి దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. ఇక్కడ ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి తాము సిద్ధంగా ఉన్నామని కార్మిక సంఘాలు చెబుతుంటే...అందుకు అవసరమైన ముడి పదార్థాలు, నిధులు సమకూర్చడానికి కేంద్రం ముందుకురావడం లేదు. ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసులకు రెండు మూతపడ్డాయి. పది రోజుల క్రితమే ఒకటి పునఃప్రారంభించారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ గురించి మాట్లాడడం లేదు. తమకు రూ.15 వేల కోట్ల సాయం చేస్తే పూర్తి ఉత్పత్తి సాధిస్తామని, సంస్థను లాభాల్లోకి తెస్తామని కార్మిక సంఘాలు చెప్పాయి. ఇదే విషయం కేంద్రానికి తెలిపాయి. కానీ ఉక్కు మంత్రిత్వ శాఖ అడిగిన మొత్తంలో కేవలం పది శాతం రూ.1,650 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. దాంతోనే లాభాలు తేవాలని చెబుతోంది. ఇది పూర్తిగా అసాధ్యం. ఇలాగే కొనసాగితే మరో నాలుగు నెలల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. రూ.వేల కోట్ల రూపాయల నష్టం వస్తుంది. తాము సాయం చేసినా లాభాలు తేలేకపోయారని అపవాదు వేసి ప్లాంటును వేరే వారికి అప్పగించేందుకు ఇప్పటి నుంచే మార్గం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో భిలాయ్, రూర్కెలా, బొకారో, బర్నాపూర్, దుర్గాపూర్‌లతో పాటు సేలం, భద్రావతి మరో రెండుచోట్ల ప్లాంట్లు ఉన్నాయి. సెయిల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 20 మిలియన్ టన్నులు. ఉద్యోగుల సంఖ్య 54,412. మిలియన్ టన్నుకు 2,721 మంది ఉన్నారు. విశాఖ ఉక్కును చూసుకుంటే మిలియన్ టన్నుకు 1,717 మందే ఉన్నారు. అంటే వేయి మంది తక్కువగా ఉన్నారు. సెయిల్‌కు అన్ని వసతులు ఉన్నాయి. దాంతో పోల్చి అలా పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అది ఎలా సాధ్యమని విశాఖ కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ముడి పదార్థాల కొరత లేకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మిగిలిన ప్లాంట్లలాగే తాము కూడా పనిచేస్తామంటే దాని గురించి మాట్లాడడం లేదు. ఇదే విధానం కొనసాగిస్తే విశాఖ ఉక్కును నడపడం కష్టమని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

ప్రణవ్‌గోపాల్‌కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ పీఠం

... 5వ పేజీ తరువాయి

విజయం సాధించారు. 2009లో కొత్తగా ఏర్పడిన పెందుర్తి నుంచి టికెట్ ఇచ్చినా ఓటమి చెందారు. 2014లో వైసీపీ తరఫున పెందుర్తి నుంచి పోటీ చేసి ఓటమి చెందిన తరువాత తెలుగుదేశం పార్టీలో చేరారు. 2021లో ఉమ్మడి జిల్లాలోని విశాఖ దక్షిణ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గ టిక్కెట్‌ను తెలుగుదేశం పార్టీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. దీంతో బాబ్జీ మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేయగా...విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సర్ది చెప్పారు. అనంతరం విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా, పెందుర్తి నియోజవర్గ ఇన్‌చార్జిగా బాబ్జీ నియమితులయ్యారు. న్యాయ శాస్త్రం అభ్యసించిన బాబ్జీకి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీతంరాజు సుధాకర్

నగరంలోని శ్రీహరిపురానికి చెందిన సీతంరాజు సుధాకర్ విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసిత కుటుంబానికి చెందిన వ్యక్తి. తరువాత అదే ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టర్‌గా వ్యాపార జీవితం ప్రారంభించారు. ఇంకా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అడుగుపెట్టిన సుధాకర్ 1992లో యువజన కాంగ్రెస్ నాయకునిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రులు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి,కిరణ్‌కుమార్‌రెడ్డితో సన్నిహితంగా ఉండేవారు. 2014లో వైసీపీలో చేరారు.అరకులోయ, అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. గత ఏడాది ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన సుధాకర్ ఈ ఏడాది సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. తరువాత ఆయనకు విశాఖ దక్షిణ నియోజ కవర్గ బాధ్యతలు అప్పగించారు. డిగ్రీ చదువుకున్న సుధాకర్ వయస్సు 53 ఏళ్లు,ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషిచేస్తా

గండి బాబ్జీ, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్

రాష్ట్రంలో నూనెగింజలు పండించే రైతుల అభ్యున్నతికి కృషిచేస్తా. వేరుశనగ, పామాయిల్, సన్‌ఫ్లవర్ పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సంస్థ వ్యాపారం పెరిగేలా కార్యాచరణ రూపొందిస్తా. నాపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువతనేత నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

సీతంరాజు సుధాకర్, ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్

పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవ సంస్థ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తా. ఆస్పత్రుల్లో జాప్యం చోటుచేసుకోకుండా చూస్తాం. ఈ పదవి ఇచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్, యువనేతకు ధన్యవాదాలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్‌లు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.

నగర అభివృద్ధికి కృషి

ఎం.ప్రణవ్‌గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

విశాఖ అభివృద్ధికి బృహత్తర ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు కృషిచేస్తా. ఇప్పటికే నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటా. శివారు ప్రాంతాల్లో కొత్త టౌన్‌షిప్‌లు ఏర్పాటుకు ప్రతిపాదిస్తాం. అన్ని వర్గాలకు మౌలిక వసతులు కల్పిస్తాం. దిగువ మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా లేఅవుట్‌లు అభివృద్ధి చేసి ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తా. పర్యాటకులను ఆకట్టుకునేలా నగరంలో కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువస్తాం. పదవి అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడు, యువనేత లోకేశ్‌కు ధన్యవాదాలు.

వేస్ట్‌గా వదిలేశారే!

- నిర్వహణకు నోచుకోని వేస్ట్ టు వండర్స్ పార్కు
- ఐదేళ్ల కిందట రూ.16.5 లక్షలతో ఆధునికీకరణ
- పాడైన టైర్లకు రంగులద్ది ఆకర్షణీయంగా ఏర్పాటు
- నేడు కళావిహీనం.. మరమ్మతుకు గురైన క్రీడా సామగ్రి
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


ఒకప్పుడు పార్కుకే ఆకర్షణీయం.. ఇప్పుడు పాడైన రంగుల టైర్లు

పెదవాల్తేరు, నవంబరు 9 : నగర జీవనంలో వేగం పెరిగింది. తెల్లవారి లేచింది మొదలు ఉరుకులు, పరుగులే. మరోవైపు... నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో కాస్త కూర్చొని సేదతీరే చోటు కనుమరుగై ఆహ్లాదం కరువవుతోంది. ఇలాంటి తరుణంలో అలసిన మనసుకు కాస్త ఊరట ఇచ్చే ప్రదేశాలు పార్కులే. కానీ వాటి నిర్వహణపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహిస్తుండడంతో పార్కులు అధ్వానంగా తయారవుతున్నాయి. అట్టహాసంగా ప్రారంభించడం మినహా వాటి బాగోగుల గురించి పట్టించుకోకపోవడంతో అనేక పార్కులు కళావిహీనంగా తయారై నిరుపయోగంగా మారాయి. ఇందులో లాసన్స్ బే కాలనీ సాగర తీరంలో ఉన్న 'వేస్ట్ టు వండర్' పార్కు ఒకటి.

నగరంలోని లాసన్స్ బే కాలనీకి సమీపంలో గల సాగర తీరంలో ఉన్న సాధారణ పార్కును కొన్నేళ్ల క్రితం 'వేస్ట్ టు వండర్స్' పార్కుగా ఆధునీకరించారు. అప్పటి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ చొరవతో ఇది ఏర్పాటైంది. సుమారు రూ.16.5 లక్షలతో దీన్ని వినూత్నంగా ఆధునీకరించారు. కొన్ని వ్యర్థ సామగ్రి (వేస్ట్ మెటీరియల్స్)కు చక్కని రూపం ఇచ్చి పార్కులో ఏర్పాటు చేశారు. ఈ పార్కులో ఉన్న సామగ్రికి మరమ్మతులు చేపట్టారు. స్వచ్ఛసర్వేక్షన్ ద్వారా సేకరించిన 1900ల కిలోల పనికిరాని టైర్లకు రంగులు అద్ది జారుడు బల్లలు, ట్రెక్కింగ్ వాల్స్, ఎడ్వెంచర్ ఏరియా, ఊయలతో పాటు పలు రకాల క్రీడాకృతులను ఏర్పాటు చేశారు. వీటి అన్నింటికీ ఆ రంగులు అద్దిన టైర్లను ఓ పద్ధతిలో అమర్చారు. దీంతో పార్కు కళ సంతరించుకోవడమే కాకుండా ఇక్కడకు వచ్చే వారికి ఎంతో ఆహ్లాదం కలిగేది. ముఖ్యంగా పిల్లలు ముచ్చట పడి ఆడేవారు. ఈ పార్కు ఏర్పాటుతో జీవీఎంసీకి ఎన్నో ప్రశంసలు అందుకుంది.



విరిగిన బెంచీ, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం


నిరుపయోగంగా పడి ఉన్న విమాన ఆకారం జారుడు బల్లలు


పార్కులో పాడైన క్రీడా పరికరాలు

అయితే ఈ పార్కు ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ నిర్వహణపై లేకపోయింది. దీంతో పార్కులో ఆట సామగ్రి మరమ్మతులకు గురైంది. రంగులు వెలిసిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. ఇప్పుడు ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఏ అధికారి, ప్రజా ప్రతినిధి ఈ పార్కు వైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యర్థ వస్తువులతో ఏర్పాటు చేయడంతో అవి ఎండకు ఎండి, వానక తడిసి దుర్వాసన వస్తోంది. వాటిని మార్చాల్సిన అవసరం ఉంది. అలాగే ముడసర్లోవ, ఆరిలోవ, పెద్దగదిలి, హనుమంతవాక, ఎంవీపీ కాలనీ, వానవానిపాలెం మీదుగా ఈ పార్కుకు అనుకొని ప్రవహించే డ్రైనేజీ వల్ల తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ఫలితంగా పార్కుకు వచ్చేందుకు సందర్శకులు వెనుకంజ వేస్తున్నారు.

ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ప్రతినిధులు ఈ పార్కు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

11 నుంచి ఏయూలో జాతీయ సదస్సు

- నూతన విద్యా విధానంపై చర్చ



సమావేశం మాట్లాడుతున్న షారోన్‌రాజు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు విద్యా విభాగాధిపతి సదస్సు డైరెక్టర్ డాక్టర్ టి.షారోన్‌రాజు తెలిపారు. శనివారం విభాగంలో సదస్సు వివరాలను ఆయన వివరించారు. 'ఈక్విటీ, డైవర్సిటీ అండ్ ఇంక్లూజన్ ఎన్ఈపీ 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ చాలెంజెస్' అంశంపై రెండు రోజుల పాటు సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సహకారంతో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో 11న సదస్సును ఏయూ వీసీ జి.శశిభూషణరావు ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల సదస్సులో భాగంగా నూతన విద్యా విధానం 2020 అమలు అనంతరం అంశాలు నిపుణులు చర్చిస్తారని, ప్రధానంగా నాణ్యత కలిగిన టీచర్ల శిక్షణ అవసరాన్ని సూచించడం, గ్రామీణ ప్రాంతాల, ప్రత్యేక అవసరాలు గల పిలలకు సైతం నూతన విద్యా విధానం అందుబాటులో ఉండే విధంగా చూడటం, వైవిధ్యమైన విద్యార్థుల కోసం అనుకూలమైన నూతన పాఠ్యక్రమం అభివృద్ధి తదితర అంశాలను ఈ సదస్సులో నిపుణులు చర్చిస్తారని చెప్పారు. రెండో రోజు ఇగ్నో రీజనల్ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జి.ధర్మారావు ఒడిశాలోని రేవనేశ్వ యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సుదర్శన్ మిశ్రా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సిక్కిం ప్రొఫెసర్ సెంట్రల్ వర్సిటీ ఆఫ్ ఒరిస్సా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.అశోక్ కుమార్, మేఘాలయ రాష్ట్రంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.మధుకర్ తదితరులు సదస్సులో ప్రత్యేక ప్రసంగాలు చేస్తారన్నారు. విద్యారంగంలో జరుగుతున్న మార్పులు, వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ఈ రెండు రోజుల సదస్సు ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని చెప్పారు.

అంకితభావంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు

- గురుకుల ఉపాధ్యాయులకు కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ హితవు
- విద్యార్థుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంపై అసంతృప్తి
- బోధన తీరు మారాలంటూ సూచన


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర్‌ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 9 : (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని, విద్యార్థులు చేసే పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్ది వారికి విద్యాబుద్ధులు నేర్పాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్‌ప్రసాద్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటలో భాగంగా ఆయన శనివారం శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం పాఠశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితులను ఆసాంతం గమనించారు. విద్యార్థులతో ముచ్చటించారు. నోటు పుస్తకాలను పరిశీలించగా, అందులో తప్పులు ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రతి క్షణం గమనించి, వారిని సరిదిద్దాలని సూచించారు. మొక్కుబడిగా పని చేయడం వల్ల ఎంత మాత్రం ప్రయోజనం ఉండదని హితవు పలికారు.

అనంతరం పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలు వేశారు. అయితే వారి నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో 'ఇలా అయితే ఎలా' అంటూ ఉపాధ్యాయులను నిలదీశారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీషులో మాట్లాడాలని, దానికి తర్ఫీదు ఇచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఆ భాషలో మాట్లాడలేకపోతే ఎలా? అంటూ ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. గురువుల బోధనపై నిర్లక్ష్యం చేయవద్దని సున్నితంగా మందలించారు. నగరానికి దగ్గరలో ఉన్న పాఠశాలలో పరిస్థితి ఇలా ఉండేమిటంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు.

అనంతరం అదే పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. నిర్వాహకులు, విద్యార్థులను అభినందించారు. చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఆరుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

ఈ సందర్భంగా కలెక్టర్.. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'సమస్యల నడుమ చదువు సాగేదెలా?' శీర్షికన వచ్చిన కథనంలో వచ్చిన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఇక్కడ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న కలెక్టర్

ముగ్గురికి ఉత్తమ అధ్యాపకుల అవార్డులు


డి.మురళీధర్


సీహెచ్ శాంతిదేవి


బి.లక్ష్మి

సిరిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల జాబితాలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు బోధన సిబ్బందికి చోటు లభించింది. వాణిజ్య శాస్త్ర విభాగం నుంచి డాక్టర్ డాక్టర్ మురళీధర్,మైక్రోబయాలజీ విభాగం నుంచి డాక్టర్ సీహెచ్ శాంతిదేవి, హిందీ విభాగం నుంచి డాక్టర్ బి.లక్ష్మికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఈ నెల 11న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా వీరు అవార్డులను అందుకోనున్నారు. అవార్డులకు ఎంపికైన అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వెంకన్న ఆలయంలో వివిధ పుష్పాలతో అర్చన


అభిషేకాలు అందుకుంటున్న స్వామివారు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివిధ పుష్పాలతో స్వామి దంపతులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పద్మావతి వేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణం నిర్వహించి, అనంతరం పుష్పాలతో అర్చన జరిపారు. కార్తీక మాసం శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలకు ఉపాధి రుణాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం కింద సెర్ప్, డీఆర్‌డీఏ ద్వారా ఎస్సీ డ్వాక్రా మహిళలకు వ్యవసాయ, సేవా, సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాల కోసం రూ. 50 వేల రాయితీతో రుణాలు ఇవ్వనున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎ.సత్యపద్మ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. వయసు 18-60 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీ డ్వాక్రా సంఘంలో తీర్మానం కలిగి ఉండాలని, రుణం తీసుకున్న వారు తప్పనిసరిగా జీవనోపాధి యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఇంతకు ముందు పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, పీఎంఏజేఏవై వంటి కేంద్ర పథకాలు తీసుకున్నట్లైతే వారు ఈ పథకానికి అనర్హులని పేర్కొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆకాశ దీపం వెలిగిస్తున్న మహిళలు


తులసిమాలలతో అలకరించిన స్వామివారు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కిషోర్ శర్మ అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని తులసిమాలలతో విశేషంగా అలకంరించారు. సాయంత్రం మహిళలు ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతిని వెలిగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని(గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

అరకులోయలో 'సంక్రాంతికి వస్తున్నాం'


- స్కూల్స్‌లో, వలిసెపూలు, మంచు అందాల్లో షూటింగ్
- హీరో వెంకటేష్, హీరోయిన్లపై చిత్రీకరణ


అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షూటింగ్ సందడి

అరకులోయ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో పర్యాటకులతోపాటు సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అగ్రహీరో వెంకటేష్, హీరోయిన్‌లు మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా షూటింగ్ గత వారం రోజుల నుంచి అరకులోయలో జరుగుతోంది. ఇప్పటివరకు అరకులోయ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ పబ్లిక్ స్కూల్, రణజిల్లెడ జలపాతం, వలిసెపూలు, మంచు అందాల నడుమ పలురకాల సీన్స్ పాటలను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించారు. వీరంతా టూరిజంకు చెందిన హరిత రిసార్టులో బస చేసి ప్రతి రోజూ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి నిర్మాత దిల్ రాజు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు


గ్లోబల్ అఖండ భజనలో పాల్గొన్న భక్తులు


దీపాలంకరణలో సత్యసాయి మందిరం

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకలను ఎంవీపీ కాలనీలోని ప్రేమ సదన్ మందిర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ అఖండ భజనలో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు భజన ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకూ నిరంతరాయంగా కొనసాగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాల్లో సత్యసాయి భక్తులు, ఆరాధకులు ఈ భజనలో పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భజనకు ముందు వేదపఠనం, అష్టోత్తరం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సిటీ కన్వీనర్ డీవీవీ సీతారామరాజు అఖండ భజనను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై అభ్యంతరకర పోస్టులు

- పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త

కూర్మన్నపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌ల ఫొటోలను మార్ఫింగ్ చేసి పొలిటికల్ పంచ్ వాట్సాప్ వెబ్ ఛానల్, ఫేస్‌బుక్, ఎక్స్ టెలీగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారనే ఫిర్యాదు మేరకు వైఎస్ఆర్ సీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు దువ్వాడ పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

యాదవజగ్గరాజుపేటకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ బోడి వెంకటేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఆ కేసులో ఏ-2గా ఉన్న మధురవాడ ధర్మపురి కాలనీకి చెందిన ఇంటూరి రవికిరణ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వైసీపీ కార్యకర్త అయిన రవికిరణ్ 2019 నుంచి 2024 జూన్ వరకూ ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో కంటెంట్ రైటర్‌గా నెలకు రూ.75 వేలు జీతానికి పని చేసేవాడన్నారు. తిరుమల శ్రీవారి భోజనంలో చనిపోయిన జెర్రి కనిపించిందని, వరద బాధితులకు సాయం పంపిణీలో అవినీతి జరిగిందని ప్రభుత్వంపై రవికిరణ్ అసత్య ప్రచారం చేసినట్టు కృష్ణా జిల్లా గుడివాడ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు.

కేసు దర్యాప్తులో భాగంగా దువ్వాడ పోలీసులు రవికిరణ్‌కు 41ఏ నోటీసులు ఇచ్చి ఈ నెల 11న మేజిస్ట్రేట్ ముందు హాజరు కావాలని చెప్పి, పంపివేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అమరేంద్ర

పెదవాల్తేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షానికి విజయవాడలోని నీట మునిగిన సమయంలో సేవలు అందించిన పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతలు దుస్తులు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం చినవాల్తేరులోని 21వ వార్డు పారిశుధ్య కార్యాలయం వద్ద 22 మంది పారిశుధ్య కార్మికులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో కార్మికులు అందించిన సేవలు అమోఘమన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 32, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు (బ్యాగ్)

రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

సమయ పాలనలో తాత్సారం వద్దు

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు


అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ సమయానికే ప్రయాణికుల కోసం బస్సులను అందుబాటులో ఉంచాలని, దీనివల్ల వారికి ఆర్టీసీ బస్సుల పట్ల నమ్మకం పెరుగుతుందని సంస్థ రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు అధికారులు, సిబ్బందికి సూచించారు. వాల్తేరు, మధురవాడ డిపోల్లో శనివారం ఆయన డిపోల ఆవరణలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. బస్టాపుల్లో ఏర్పాటు చేసిన బస్సుల రాకపోకల టైమింగ్ బోర్డులను ప్రయాణికులు గమనించి, ఆ సమయాలకు బస్టాపులో వేచి ఉంటారన్నారు. అయితే సూచించిన సమయానికి బస్సులు రాకపోయినా, ఆ సమయాని కన్నా ముందు వచ్చి వెళ్లిపోయినా ప్రయాణికులు అసహనానికి గురై ప్రత్యామ్నాయ రవాణా సాధనాలను ఆశ్రయిస్తారని, ఆర్టీసీ బస్సులపై కూడా నమ్మకం కోల్పోతారన్నారు. స్టూడెంట్ పాస్‌లు ఉన్న విద్యార్థులకు సకాలంలో రవాణా సేవలందించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. సాధారణ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు రవాణా సౌకర్యాలను అందించాలని అప్పలనాయుడు పేర్కొన్నారు. ఆర్టీసీ విశాఖ రీజియన్ ప్రవేశపెట్టిన పంచారామాల క్షేత్రదర్శని ప్యాకేజీకి మంచి స్పందన వస్తుందన్నారు. శబరిమలై యాత్రకు కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, మధురవాడ డిపో మేనేజర్ రాజు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

భర్త, అత్తమామల అరెస్టు

సీతంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త, మామల వేధింపులు భరించలేక ఓ మహిళ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ద్వారకా పోలీసుస్టేషన్ పరిధి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో సత్యప్రియ (31), ఇల్లిశెట్టి కార్తికేయ (38) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. సత్యప్రియకు కట్నకానుకలుగా వివాహ సమయంలో రూ.4.5 కోట్లు, బంగారం, పెళ్లి ఖర్చుల కింద రూ.కోటి మొత్తాన్ని ఇల్లిశెట్టి కార్తికేయ కుటుంబ సభ్యులకు సత్యప్రియ తల్లిదండ్రులు శైలజ, సూర్యచంద్రరావులు ముట్టజెప్పారు. వివాహమైనప్పటి నుంచి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని కృపా నిలయంలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా సత్యప్రియపై భర్త కార్తికేయతో పాటు అత్తమామల వేధింపులు మొదలయ్యాయి. ఆమెను అనుమానించడమే కాక, ఇంకా కట్నం కావాలని వేధించడం మొదలు పెట్టారు. దీంతో సత్యప్రియ కొద్ది రోజుల క్రితం తల్లికి ఫోను చేసి తన బాధను తెలిపింది. అత్తమామలతో పాటు భర్త వేధింపులు అధికమవడంతో సత్యప్రియ శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన కార్తికేయ పడక గదిలో సత్యప్రియ ఉరేసుకుని ఉండడం చూసి తల్లిదండ్రులకు చెప్పాడు. సత్యప్రియ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లికి సమీప బంధువులు ఫోనులో సమాచారం అందించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నవారు కన్నీరు మున్నీరై తమ కుమార్తె చావుకు అల్లుడు కార్తికేయ, వారి తల్లిదండ్రులే కారకులంటూ ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వెంకటరమణ కేసు నమోదు చేపట్టారు. వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. సత్యప్రియకు పోస్టుమార్టం నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కార్తికేయను, అతని తల్లిదండ్రులు శైలజ, సూర్యచంద్రరావులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.

'పారిశుధ్య సిబ్బంది సేవలు శ్లాఘనీయం'



పారిశుధ్య ఉద్యోగినికి చీర అందజేస్తున్న కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని గ్రేటర్ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. వార్డులో పారిశుధ్య సేవలు అందజేస్తున్న మహిళా సిబ్బందిని నేరెళ్ల కోనేరు వద్ద గల జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ఘనంగా సన్మానించి వారికి చీరలు అందజేశారు. ఇటీవల విజయవాడ వరద ప్రాంతాల్లోనూ విశేష సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాశీరావు, కూటమి నాయకులు నారా నాగేశ్వరరావు, మంత్రి శాలివాహన, కొట్టాల రమేష్, కుందుల బద్రీ, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

అతి తక్కువ బరువుతో శిశువు జననం



ఆరోగ్యంగా ఉన్న శిశువుతో వైద్యబృందం

మహారాణిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అతి తక్కువ బరువుతో పుట్టిన శిశువుకు మెరుగైన వైద్యం అందించిన వైద్యులు ప్రాణం నిలబెట్టారు. మహారాణిపేటలోని మెడికవర్ మదర్ అండ్ చైల్డ్ విభాగం ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ప్రముఖ నియోనెంటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. విజయనగరం వాసి రమాదేవికి 25 వారాల గర్భదారణ సమయంలోనే (నెలలు నిండకుండా) అనారోగ్య పరిస్థితి నెలకొనటంతో ప్రీమెచ్యూర్ బేబీ జన్మించింది శిశువు కేవలం 510 గ్రాముల బరువు ఉండడంతో ఊపిరితిత్తులు, అవయవాలు అపరిపక్వంగా ఉండటంతో రోగనిరోధక శక్తి తగ్గి ఇన్‌ఫెక్షన్లు వచ్చాయి శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో 25 రోజులు ఇన్వాసివ్ వెంటిలేషన్‌లో ఉంచారు. కృత్రిమపద్ధతిలో పాలు, పోషకాలు అందించారు. సుమారు 107 రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండడంతో 1.65 గ్రాముల బరువు పెరిగింది. అన్ని అవయవాలు పనిచేయటంతో పాటు సహజ సిద్ధంగా ఆహారం తీసుకోవటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు తెలిపారు,

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి

అల్లిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం పరిధి 34వ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానిక జనసేన వార్డు అధ్యక్షుడు వాసుపల్లి రమేష్, ఇంచార్జ్ నారా నాగేశ్వరరావులు శనివారం ఏపీఈపీడీసీఎల్ ఏఈ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చాలా చోట్ల లోవోల్టేజ్ కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయని, కొన్నిచోట్ల స్తంభాలపై వైర్లు కనిపించడం లేదని, సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఏఈ హామీ ఇచ్చారు.

పూర్ణామార్కెట్‌లో ఆశీళ్ల దందా!

చిరు వ్యాపారుల నుంచి బలవంతపు వసూళ్లు

జగదాంబ కూడలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలుకు కాంట్రాక్టు సిబ్బంది జులుం ప్రదర్శిస్తుండడంతో చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై జంగిళ్లతో వ్యాపారాలు సాగించే వారి నుంచి కూడా బలవంతరగా ఆశీలు వసూలుకు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ లోపల, రోడ్డుమీద చిరువ్యాపారాలు సాగిస్తున్న వారితో పాటు పార్కింగ్ స్థలానికి సంబంధించిన ఆశీలు కాంట్రాక్టును జోన్-4 అధికారులు ఖరారు చేసి బాధ్యతలు అప్పగించారు. రోడ్డుపై చిరు వ్యాపారాలు సాగించే వారితో పాటు కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఆశీలు వసూలు బాధ్యతను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ సిబ్బంది రోడ్డు పైన వ్యాపారాలు సాగిస్తున్న వారి నుంచి నిర్బంధంగా వసూళ్లకు పాల్పడుతున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారి దగ్గర రోజువారీ ఆశీలు రూ.20 వసూలు చేయాల్సి ఉండగా, రూ. 150 వరకు డిమాండ్ చేస్తున్నట్టు పూలు విక్రయిస్తున్న ఓ మహిళ ఆవేదన వ్యక్తంచేశారు. చెల్లించకుంటే పూల బుట్టలను విసిరేస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. పండుగ సందర్భాల్లో రోడ్డుపై వ్యాపారుల నుంచి జంగిడికి రూ.150 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మార్కెట్‌లో ఆశీలు కాంట్రాక్టు వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, టీడీపీ నాయకులు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడడంపై సీపీఎం నేతలు నిలదీశారు. దీంతో సంబంధిత ఆశీలు కాంట్రాక్టును జీవీఎంసీ ఉన్నతాధికారులు నిలిపేశారు. అప్పట్లో తీవ్ర విమర్శలు గుప్పించిన వార్డు ప్రజాప్రతినిధి అనుచరగణం ఇప్పుడు అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడం గమనార్హం. జీవీఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాయంత్రం సమయంలో పార్కింగ్ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆశీలు కాంట్రాక్టర్ అక్రమ దందా పై పలువురు వ్యాపారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. అక్రమ వసూళ్లకు జీవీఎంసీ జోన్ 4, రెవెన్యూ అధికారులు అడ్డుకట్టవేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



పూర్ణామార్కెట్‌లో రోడ్డుపై వ్యాపారం చేసుకుంటున్న మహిళలు

ఫుట్‌బాల్ సంఘంలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అండదండలు, రాజకీయ పలుకుబడితో కొందరు ఫుట్‌బాల్ క్రీడారంగంలోకి చొరబడి వర్ధమాన ఔత్సాహిక ఫుట్‌బాలర్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ఏపీ ఫుట్‌బాల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, వాల్తేరు ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, క్రీడాప్రాధికార సంస్థ, కూటమి ప్రభుత్వ పెద్దలు వాస్తవాలను గుర్తించి అనధికార సంఘాన్ని రద్దు చేసి వాల్తేరు ఫుట్‌బాల్ సంఘానికి సహకరించాలని కోరారు. దీనిపై అన్ని ఆధారాలతో కలెక్టర్, శాప్, క్రీడా మంత్రికి వినతిపత్రం అందజేశామని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ ఫుట్‌బాల్‌తో ఎటువంటి అనుబంధం లేని కొందరు వ్యక్తులతో ఏలూరు వైసీపీ మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ కలిసి ఆర్థిక, అధికార బలంతో దొడ్డిదారిన విశాఖలో చట్ట విరుద్ధంగా ఫుట్‌బాల్ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి క్రీడాకారులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అప్పటి క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, ఏఐఎఫ్‌ఎఫ్ ప్రతినిధులకు తప్పుడు సమాచారమిచ్చారని ఆరోపించారు.

'కథా రచనలో కారా శైలి ప్రత్యేకం'



కాళీపట్నం రామారావు మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కథా రచనలో కాళీపట్నం రామారావు (కారా మాస్టారు)ది ప్రత్యేక శైలి అని సుప్రసిద్ధ రచయిత వివినమూర్తి అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రైటర్స్ అకాడమీ, సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కథా రచయిత కాళీపట్నం రామారావు శతజయంత్యుత్సవ సదస్సు నిర్వహించారు. తెలుగు సలహా మండలి కన్వీనర్ డాక్టర్ సి.మృణాళిని అధ్యక్షత వహించిన సదస్సులో తొలుత కాళీపట్నం రామారావు మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివినమూర్తి మాట్లాడుతూ పతంజలి, హరినాథ్ లకు కారాతో ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. కారాకు పల్లెటూర్లు అంటే ఇష్టమన్నారు. అక్కడ వాస్తవిక ప్రపంచం కనిపిస్తుందని అభిప్రాయపడేవారన్నారు. నగరంలోనూ, పల్లెల్లోనూ తేడాలను కారా మాస్టర్ పరిశీలించేవారని తెలియజేశారు. విజ్ఞానాన్ని అవగాహన చేసుకుని రచనలు చేసేవారన్నారు. ఏ వస్తువు ఎవరి దగరకు వచ్చినా అందులో శ్రమ ఉంటుందని రామారావు చెప్పేవారని తెలిపారు. రచయిత బాధ్యతాయుతంగా ఉండాలని భావించేవారని తెలిపారు. తెలుగు సలహా మండలి కన్వీనర్ డాక్టర్ మృణాళిని మాట్లాడుతూ బాధ్యత తెలిసిన కథకుడు రామారావు అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొలిపేలా కాళీపట్నం రచనలు ఉండేవన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ కారా కథలు సజీవంగా ఉంటాయన్నారు. పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ ఉత్తర నియోజకవర్గం 14వ వార్డు అధ్యక్షులు గొంప ధర్మరావు, పీవీ వసంతరావు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించారు. సభ్యత్వాలు నమోదు చేసుకోడానికి చాలా మంది ఆసక్తి చూపించడంతో రాత్రి వరకు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకురాలు జె.హేమ, సిహెచ్ దేవుడు, ఎ.శ్రీనివాసరావు, పుల్లేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

43 మంది ఇళ్ల డబ్బు వాపసు



చెక్కులు పొందిన వారితో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇంటి కోసం ప్రభుత్వానికి డబ్బు కట్టినా ఇల్లు, డబ్బు రెండూ రాకపోవడంతో చాలా మంది బాధలు పడ్డారని, కూటమి ప్రభుత్వం వారి డబ్బును వెనక్కి ఇచ్చిందని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో శనివారం 43 మందికి చెక్కురూపంలో రూ.9,01,000 అందజేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వ హయాంలో వీరికి ఇళ్ల మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ రాము, ఏపీడీ పుణ్యవతి, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు నూతన ఏడీఆర్ఎంగా శాంతారామ్ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నూతన అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా (ఏడీఆర్ఎం) శాంతారామ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. 2004 ఇండియన్ రైల్వే సర్వీసు ఆఫ్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఈ) బ్యాచ్‌కు చెందిన శాంతారామ్...హైదరాబాద్ లోని జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్, విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంటీఏ పూర్తి చేశారు. సౌత్ ఈస్ట్రన్ రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వే, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ల పరిధిలోని పలు కీలక శాఖలలో పనిచేసి ట్రాక్ నిర్వహణ, నిర్మాణ ప్రాజెక్టులలో తనదైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రైల్వే ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌లో విశేష అనుభవం ఉన్న శాంతారామ్...రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీసెస్ (ఆర్ఐటీఈఎస్) ద్వారా మలేషియాలోని రైల్వే ప్రాజెక్టులలోనూ పనిచేసిన అనుభవం ఉంది. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్‌లో డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా, విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్)గా నాలుగేళ్ల పనిచేసి బదిలీపై వాల్తేరు డివిజన్ ఏడీఆర్ఎంగా (ఇన్‌ఫ్రా) వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా)గా పనిచేసిన సుధార్‌కుమార్ గుప్తా సెంట్రల్ రైల్వేకు బదిలీ అయ్యారు.

'స్టేషన్ బెయిల్ ప్రక్రియతో న్యాయానికి అవరోధం'



సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ అహ్మద్, ఇతర న్యాయవాదులు

డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ బెయిల్ విధానం పోలీసులకు విస్తృత అధికారాలిస్తూ, న్యాయవ్యవస్థ అధికారాలను కుదిస్తోందని న్యాయవాదుల సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ లాయర్స్ ఫోరం చాంబర్‌లో శనివారం 41ఏ సీఆర్‌పీసీ స్టేషన్ బెయిల్ ప్రక్రియపై చర్చా కార్యక్రమాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణ్‌కుమార్ సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం కన్వీనర్ ఐ.ఎం.అహ్మద్ మాట్లాడుతూ తీర్పు తప్పు అన్ని అధికారాలను విచారణ పేరుతో పోలీసులకు అప్పగించడం దుర్వినియోగానికి కారణమవుతోందని అభిప్రాయపడ్డారు. ఫోరం అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు, అధికార దుర్వినియోగం ఆపడానికి తక్షణమే స్టేషన్ బెయిల్ విధానాన్ని తొలగించి పాత బెయిల్ పద్ధతిని పెట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది టి.బోస్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఉద్యమాన్ని ఫోరం ఆధ్వర్యంలో చేపట్టి విజయం సాధించామని గుర్తుచేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణకుమార్ తన సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రణవ్‌గోపాల్‌కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ పీఠం

... 5వ పేజీ తరువాయి

విజయం సాధించారు. 2009లో కొత్తగా ఏర్పడిన పెందుర్తి నుంచి టికెట్ ఇచ్చినా ఓటమి చెందారు. 2014లో వైసీపీ తరఫున పెందుర్తి నుంచి పోటీ చేసి ఓటమి చెందిన తరువాత తెలుగుదేశం పార్టీలో చేరారు. 2021లో ఉమ్మడి జిల్లాలోని విశాఖ దక్షిణ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గ టిక్కెట్‌ను తెలుగుదేశం పార్టీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. దీంతో బాబ్జీ మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేయగా...విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సర్దిచెప్పారు. అనంతరం విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా, పెందుర్తి నియోజవర్గ ఇన్‌చార్జిగా బాబ్జీ నియమితులయ్యారు. న్యాయ శాస్త్రం అభ్యసించిన బాబ్జీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీతంరాజు సుధాకర్

నగరంలోని శ్రీహరిపురానికి చెందిన సీతంరాజు సుధాకర్ విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసిత కుటుంబానికి చెందిన వ్యక్తి. తరువాత అదే ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టర్‌గా వ్యాపార జీవితం ప్రారంభించారు. ఇంకా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అడుగుపెట్టిన సుధాకర్ 1992లో యువజన కాంగ్రెస్ నాయకునిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రులు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డితో సన్నిహితంగా ఉండేవారు. 2014లో వైసీపీలో చేరారు. అరకులోయ, అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. గత ఏడాది ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన సుధాకర్ ఈ ఏడాది సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. తరువాత విశాఖ దక్షిణ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. డిగ్రీ చదువుకున్న సుధాకర్ వయస్సు 53 సంవత్సరాలు, ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

రైతుల అభ్యున్నతికి కృషిచేస్తా

రాష్ట్రంలో నూనెగింజలు పండించే రైతుల అభ్యున్నతికి కృషిచేస్తా. వేరుశనగ, పామాయిల్, సన్‌ఫ్లవర్ పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సంస్థ వ్యాపారం పెరిగేలా కార్యాచరణ రూపొందిస్తా. నాపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువనేత నారా లోకేశ్‌కు ధన్యవాదాలు **-గండిబాబ్జీ, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్**

పేదలకు మెరుగైన వైద్య సేవలు

పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవ సంస్థ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తా. ఆస్పత్రుల్లో జాప్యం చోటుచేసుకోకుండా చూస్తాం. ఈ పదవి ఇచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్, యువనేతకు ధన్యవాదాలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్‌లు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. **-సీతంరాజు సుధాకర్, ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్**

నగర అభివృద్ధికి కృషి

రాష్ట్రంలోనే అతి పెద్ద నగరం విశాఖ అభివృద్ధికి బృహత్తర ప్రణాళికలు రూపొందించి అమలుచేసేందుకు కృషిచేస్తా. ఇప్పటికే నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటా. శివారు ప్రాంతాల్లో కొత్త టౌన్‌షిప్‌లు ఏర్పాటుకు ప్రతిపాదిస్తాం. నగరం, శివారు ప్రాంతాల్లో అన్ని వర్గాలకు మౌలిక వసతులు కల్పిస్తాం. దిగువ మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా లేఅవుట్‌లు అభివృద్ధి చేసి ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తా. పర్యాటకులను ఆకట్టుకునేలా నగరంలో కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువస్తాం. నాపై ఎంతో నమ్మకం ఉంచి పదవి అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్‌కు ధన్యవాదాలు**-ఎం.ప్రణవ్‌గోపాల్, చైర్మన్,వీఎంఆర్‌డీఏ**

'బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలి'



ప్రజాసంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సంగటి మనోహర్ మహాజన్

సీతంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలని, ఈవీఎంల ద్వారా ట్యాంపరింగ్‌కు అవకాశం ఉందని పలు సంఘాల ప్రతినిధులు, పార్టీల నేతలు అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల అక్రమాలు, ఈవీఎంలలో అవకతవకలు, ఏకకాలంలో జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తూ రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో శనివారం పలు దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, సమన్వయకర్త సంగటి మనోహర్ మహాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి. ప్రభాకర్, విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, అడ్వైజర్ ఎస్ఆర్ వేమన, భారత్ సమాజ్ డెవలప్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చింతాడ సూర్యం, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సుధాకర్, నవయానం బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈవీఎంల ద్వారా ఏ రకంగా ట్యాంపరింగ్ చేయవచ్చనే విషయాన్ని అనేక మంది నిపుణులు నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలోనూ మన దేశంలో బ్యాలెట్ పత్రాలు ఉండేవని పేర్కొన్నారు. గతంలో 40 వేల ఈవీఎంలు కనిపించలేదని, అవి ఎలా మాయమయ్యాయనే ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నుంచి సమాధానం లేదన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని మార్చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటూ రాజ్యాధికారం కావాలని దళిత, బహుజన మహాజన, లౌకిక పార్టీలన్నీ ఏకం కావాలని స్పష్టం చేశారు. పలు ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడారు.

ఉక్కుకు పొంచి ఉన్న ముప్పు

... 5వ పేజీ తరువాయి

ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 14,290 మంది ఉన్నారు. అంటే మిలియన్ టన్నుకు 2,041 మంది ఉన్నారు. విశాఖ స్టీల్‌తో పోలిస్తే మిలియన్ టన్నుకు 300 మంది ఎక్కువ ఉన్నారు. పైగా ఏటా 250 మందిని కొత్తగా తీసుకుంటున్నారు.

లాభాలు ఎలా వస్తాయి?

సెయిల్‌తో సమానంగా లాభాలు తీసుకురావాలని, దీనికి కార్మికులు తీవ్రంగా కృషిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సెయిల్‌కు సొంత గనులు ఉన్నాయి. నిధులకు కొరత లేదు. ఉద్యోగుల సంఖ్య అవసరమైనంత ఉంది. పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే లాభాలు వస్తున్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితి దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. ఇక్కడ ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి తాము సిద్ధంగా ఉన్నామని కార్మిక సంఘాలు చెబుతుంటే...అందుకు అవసరమైన ముడి పదార్థాలు, నిధులు సమకూర్చడానికి కేంద్రం ముందుకురావడం లేదు. ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసులకు రెండు మూతపడ్డాయి. పది రోజుల క్రితమే ఒకటి పునఃప్రారంభించారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ గురించి మాట్లాడడం లేదు. తమకు రూ.15 వేల కోట్ల సాయం చేస్తే పూర్తి ఉత్పత్తి సాధిస్తామని, సంస్థను లాభాల్లోకి తెస్తామని కార్మిక సంఘాలు చెప్పాయి. ఇదే విషయం కేంద్రానికి తెలిపాయి. కానీ ఉక్కు మంత్రిత్వ శాఖ అడిగిన మొత్తంలో కేవలం పది శాతం రూ.1,650 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. దాంతోనే లాభాలు తేవాలని చెబుతోంది. ఇది పూర్తిగా అసాధ్యం. ఇలాగే కొనసాగితే మరో నాలుగు నెలల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. రూ.వేల కోట్ల రూపాయల నష్టం వస్తుంది. తాము సాయం చేసినా లాభాలు తేలేకపోయారని అపవాదు వేసి ప్లాంటును వేరే వారికి అప్పగించేందుకు ఇప్పటి నుంచే మార్గం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెయిల్‌తో పోలికా?

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో భిలాయ్, రూర్కెలా, బొకారో, బర్నాపూర్, దుర్గాపూర్‌లతో పాటు సేలం, భద్రావతి మరో రెండుచోట్ల ప్లాంట్లు ఉన్నాయి. సెయిల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 20 మిలియన్ టన్నులు. ఉద్యోగుల సంఖ్య 54,412. మిలియన్ టన్నుకు 2,721 మంది ఉన్నారు. విశాఖ ఉక్కును చూసుకుంటే మిలియన్ టన్నుకు 1,717 మందే ఉన్నారు. అంటే వేయి మంది తక్కువగా ఉన్నారు. సెయిల్‌కు అన్ని వసతులు ఉన్నాయి. దాంతో పోల్చి అలా పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అది ఎలా సాధ్యమని విశాఖ కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ముడి పదార్థాల కొరత లేకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మిగిలిన ప్లాంట్లలాగే తాము కూడా పనిచేస్తామంటే దాని గురించి మాట్లాడడం లేదు. ఇదే విధానం కొనసాగిస్తే విశాఖ ఉక్కును నడపడం కష్టమని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

మళ్లీ తెరపైకి కోస్టల్ కారిడార్

... 5వ పేజీ తరువాయి


కొన్ని అంగీకారాలు కుదిరాయని జిల్లా అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

⏩ ఈ ప్రాజెక్టుకు భూ సేకరణకు రూ.4,315 కోట్లు, నిర్మాణాలకు రూ.1,974 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ⏩ భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,200 కోట్లు భరించడానికి ఒప్పుకొంది. మిగిలిన మొత్తం కేంద్రం పెట్టుకోవాలి. ⏩ నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీ మినహాయింపు

త్వరలోనే డీపీఆర్ పూర్తి

ఈ కోస్టల్ కారిడార్ డీపీఆర్‌కు గత ఏడాది ఆగస్టులోనే రూ.1.45 కోట్లు మంజూరుచేశారని, ప్రస్తుతం డీపీఆర్ తయారు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి చేసి కేంద్రానికి సమర్పిస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఇది పూర్తయితే కేంద్ర ప్రతినిధులతో చర్చించి, ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళతామని సీఎం పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం విశాఖలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ఈ ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని నాటి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇందులో భీమునిపట్నం నుంచి భోగాపురం వరకు 19.66 కి.మీ. పొడవున గ్రీన్ ఫీల్డ్ కారిడార్ వేయాలని నిర్ణయించారు. పట్టణంలో పురాతన కట్టడాలు కూల్చాల్సి వస్తుందని చెప్పి కారిడార్ మలుపు తిప్పారు. ఈ మార్గంలో వైసీపీ నాయకులు కొన్ని వందల ఎకరాలు సొంతం చేసుకున్నారు.

మహారాష్ట్ర ఎన్నికల సమన్వయకర్తగా నారాయణరావు



డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమన్వయకర్తగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీఏ నారాయణరావును ఏఐసీసీ నియమించింది. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న కొల్హాపూర్ జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల బాధ్యతలు తనకు అప్పగించడంపై ఏఐసీసీ ప్రముఖులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సౌండ్ సైలెన్సర్లు ధ్వంసం

... 5వ పేజీ తరువాయి

182 వాహనాలకు ఉన్న మాడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటినీ శనివారం బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయం ఎదురుగా రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఇలాంటి మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగించడం మోటారు వాహనాల చట్టం-1998 సెక్షన్ 190 ప్రకారం నేరమన్నారు. మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలతో పట్టుబడితే మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ.పది వేలు జరిమానా విధిస్తారన్నారు. రెండోసారి పట్టుబడితే వాహనం సీజ్ చేసి, వాహనం నడిపేవారి లైసెన్స్‌ను ఆరు నెలలు సస్పెండ్ చేయడంతోపాటు మూడు నెలలు జైలు శిక్ష, రూ.పది వేల జరిమానాకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా సెప్టెంబరు ఒకటి నుంచి హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన 70,500 మంది లైసెన్స్‌లను మూడు నెలలు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాల్సిందేనని సీపీ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు మేరీప్రశాంతి, అజితా వేజెండ్ల, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేస్ట్‌గా వదిలేశారే!

- నిర్వహణకు నోచుకోని వేస్ట్ టు వండర్స్ పార్కు
- ఐదేళ్ల కిందట రూ.16.5 లక్షలతో ఆధునికీకరణ
- పాడైన టైర్లకు రంగులద్ది ఆకర్షణీయంగా ఏర్పాటు
- నేడు కళావిహీనం.. మరమ్మతుకు గురైన క్రీడా సామగ్రి
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


ఒకప్పుడు పార్కుకే ఆకర్షణీయం.. ఇప్పుడు పాడైన రంగుల టైర్లు

పెదవాల్తేరు, నవంబరు 9 : నగర జీవనంలో వేగం పెరిగింది. తెల్లవారి లేచింది మొదలు ఉరుకులు, పరుగులే. మరోవైపు.. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో కాస్త కూర్చొని సేదతీరే చోటు కనుమరుగై ఆహ్లాదం కరువవుతోంది. ఇలాంటి తరుణంలో అలసిన మనసుకు కాస్త ఊరట ఇచ్చే ప్రదేశాలు పార్కులే. కానీ వాటి నిర్వహణపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహిస్తుండడంతో పార్కులు అధ్వానంగా తయారవుతున్నాయి. అట్టహాసంగా ప్రారంభించడం మినహా వాటి బాగోగుల గురించి పట్టించుకోకపోవడంతో అనేక పార్కులు కళావిహీనంగా తయారై నిరుపయోగంగా మారాయి. ఇందులో లాసన్స్ బే కాలనీ సాగర తీరంలో ఉన్న 'వేస్ట్ టు వండర్' పార్కు ఒకటి.

నగరంలోని లాసన్స్ బే కాలనీకి సమీపంలో గల సాగర తీరంలో ఉన్న సాధారణ పార్కును కొన్నేళ్ల క్రితం 'వేస్ట్ టు వండర్స్' పార్కుగా ఆధునీకరించారు. అప్పటి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ చొరవతో ఇది ఏర్పాటైంది. సుమారు రూ.16.5 లక్షలతో దీన్ని వినూత్నంగా ఆధునీకరించారు. కొన్ని వ్యర్థ సామగ్రి (వేస్ట్ మెటీరియల్స్)కు చక్కని రూపం ఇచ్చి పార్కులో ఏర్పాటు చేశారు. ఈ పార్కులో ఉన్న సామగ్రికి మరమ్మతులు చేపట్టారు. స్వచ్ఛసర్వేక్షన్ ద్వారా సేకరించిన 1900ల కిలోల పనికిరాని టైర్లకు రంగులు అద్ది జారుడు బల్లలు, ట్రెక్కింగ్ వాల్స్, ఎడ్వెంచర్ ఏరియా, ఊయలతో పాటు పలు రకాల క్రీడాకృతులను ఏర్పాటు చేశారు. వీటి అన్నింటికీ ఆ రంగులు అద్దిన టైర్లను ఓ పద్ధతిలో అమర్చారు. దీంతో పార్కు కళ సంతరించుకోవడమే కాకుండా ఇక్కడకు వచ్చే వారికి ఎంతో ఆహ్లాదం కలిగేది. ముఖ్యంగా పిల్లలు ముచ్చట పడి ఆడేవారు. ఈ పార్కు ఏర్పాటుతో జీవీఎంసీకి ఎన్నో ప్రశంసలు అందుకుంది.



విరిగిన బెంచీ, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం


నిరుపయోగంగా పడి ఉన్న విమాన ఆకారం జారుడు బల్లలు


పార్కులో పాడైన క్రీడా పరికరాలు

అయితే ఈ పార్కు ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ నిర్వహణపై లేకపోయింది. దీంతో పార్కులో ఆట సామగ్రి మరమ్మతులకు గురైంది. రంగులు వెలిసిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. ఇప్పుడు ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఏ అధికారి, ప్రజా ప్రతినిధి ఈ పార్కు వైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యర్థ వస్తువులతో ఏర్పాటు చేయడంతో అవి ఎండకు ఎండి, వానక తడిసి దుర్వాసన వస్తోంది. వాటిని మార్చాల్సిన అవసరం ఉంది. అలాగే ముడసర్లోవ, ఆరిలోవ, పెద్దగదిలి, హనుమంతవాక, ఎంవీపీ కాలనీ, వాసవానిపాలెం మీదుగా ఈ పార్కుకు అనుకొని ప్రవహించే డ్రైనేజీ వల్ల తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ఫలితంగా పార్కుకు వచ్చేందుకు సందర్శకులు వెనుకంజ వేస్తున్నారు.

ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ప్రతినిధులు ఈ పార్కు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

11 నుంచి ఏయూలో జాతీయ సదస్సు

- నూతన విద్యా విధానంపై చర్చ



సమావేశం మాట్లాడుతున్న షారోన్‌రాజు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు విద్యా విభాగాధిపతి సదస్సు డైరెక్టర్ డాక్టర్ టి.షారోన్‌రాజు తెలిపారు. శనివారం విభాగంలో సదస్సు వివరాలను ఆయన వివరించారు. 'ఈక్విటీ, డైవర్సిటీ అండ్ ఇంక్లూజన్ ఎన్ఈపీ 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ చాలెంజెస్' అంశంపై రెండు రోజుల పాటు సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సహకారంతో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో 11న సదస్సును ఏయూ వీసీ జి.శశిభూషణరావు ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల సదస్సులో భాగంగా నూతన విద్యా విధానం 2020 అమలు అనంతరం అంశాలు నిపుణులు చర్చిస్తారని, ప్రధానంగా నాణ్యత కలిగిన టీచర్ల శిక్షణ అవసరాన్ని సూచించడం, గ్రామీణ ప్రాంతాల, ప్రత్యేక అవసరాలు గల పిలలకు సైతం నూతన విద్యా విధానం అందుబాటులో ఉండే విధంగా చూడటం, వైవిధ్యమైన విద్యార్థుల కోసం అనుకూలమైన నూతన పాఠ్యక్రమం అబివృద్ధి తదితర అంశాలను ఈ సదస్సులో నిపుణులు చర్చిస్తారని చెప్పారు. రెండో రోజు ఇగ్నో రీజనల్ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జి.ధర్మారావు ఒడిశాలోని రేవనేశ్వ యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సుదర్శన్ మిశ్రా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సిక్కిం ప్రొఫెసర్ సెంట్రల్ వర్సిటీ ఆఫ్ ఒరిస్సా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.అశోక్ కుమార్, మేఘాలయ రాష్ట్రంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.మధుకర్ తదితరులు సదస్సులో ప్రత్యేక ప్రసంగాలు చేస్తారన్నారు. విద్యారంగంలో జరుగుతున్న మార్పులు, వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ఈ రెండు రోజుల సదస్సు ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని చెప్పారు.

అంకితభావంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు

- గురుకుల ఉపాధ్యాయులకు కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ హితవు
- విద్యార్థుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంపై అసంతృప్తి
- బోధన తీరు మారాలంటూ సూచన


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర్‌ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 9 : (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని, విద్యార్థులు చేసే పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్ది వారికి విద్యాబుద్ధులు నేర్పాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్‌ప్రసాద్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటలో భాగంగా ఆయన శనివారం శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం పాఠశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితులను ఆసాంతం గమనించారు. విద్యార్థులతో ముచ్చటించారు. నోటు పుస్తకాలను పరిశీలించగా, అందులో తప్పులు ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రతి క్షణం గమనించి, వారిని సరిదిద్దాలని సూచించారు. మొక్కుబడిగా పని చేయడం వల్ల ఎంత మాత్రం ప్రయోజనం ఉండదని హితవు పలికారు.

అనంతరం పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలు వేశారు. అయితే వారి నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో 'ఇలా అయితే ఎలా' అంటూ ఉపాధ్యాయులను నిలదీశారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీషులో మాట్లాడాలని, దానికి తర్ఫీదు ఇచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఆ భాషలో మాట్లాడలేకపోతే ఎలా? అంటూ ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. గురువుల బోధనపై నిర్లక్ష్యం చేయవద్దని సున్నితంగా మందలించారు. నగరానికి దగ్గరలో ఉన్న పాఠశాలలో పరిస్థితి ఇలా ఉండేమిటంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు.

అనంతరం అదే పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. నిర్వాహకులు, విద్యార్థులను అభినందించారు. చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఆరుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

ఈ సందర్భంగా కలెక్టర్.. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'సమస్యల నడుమ చదువు సాగేదెలా?' శీర్షికన వచ్చిన కథనంలో వచ్చిన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఇక్కడ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న కలెక్టర్

ముగ్గురికి ఉత్తమ అధ్యాపకుల అవార్డులు


డి.మురళీధర్


సీహెచ్ శాంతిదేవి


బి.లక్ష్మి

సిరిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల జాబితాలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు బోధన సిబ్బందికి చోటు లభించింది. వాణిజ్య శాస్త్ర విభాగం నుంచి డాక్టర్ డాక్టర్ మురళీధర్,మైక్రోబయాలజీ విభాగం నుంచి డాక్టర్ సీహెచ్ శాంతిదేవి, హిందీ విభాగం నుంచి డాక్టర్ బి.లక్ష్మికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఈ నెల 11న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా వీరు అవార్డులను అందుకోనున్నారు. అవార్డులకు ఎంపికైన అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వెంకన్న ఆలయంలో వివిధ పుష్పాలతో అర్చన

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివిధ పుష్పాలతో స్వామి దంపతులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పద్మావతి వేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణం నిర్వహించి, అనంతరం పుష్పాలతో అర్చన జరిపారు. కార్తీక మాసం శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


అభిషేకాలు అందుకుంటున్న స్వామివారు

ఎస్సీ మహిళలకు ఉపాధి రుణాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం కింద సెర్ప్, డీఆర్‌డీఏ ద్వారా ఎస్సీ డ్వాక్రా మహిళలకు వ్యవసాయ, సేవా, సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాల కోసం రూ. 50 వేల రాయితీతో రుణాలు ఇవ్వనున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎ.సత్యపద్మ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. వయసు 18-60 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీ డ్వాక్రా సంఘంలో తీర్మానం కలిగి ఉండాలని, రుణం తీసుకున్న వారు తప్పనిసరిగా జీవనోపాధి యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఇంతకు ముందు పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, పీఎంఏజేపై వంటి కేంద్ర పథకాలు తీసుకున్నట్లైతే వారు ఈ పథకానికి అనర్హులని పేర్కొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆకాశ దీపం వెలిగిస్తున్న మహిళలు


తులసిమాలలతో అలకరించిన స్వామివారు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కిషోర్ శర్మ అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని తులసిమాలలతో విశేషంగా అలకంరించారు. సాయంత్రం మహిళలు ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతిని వెలిగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 32, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీర దోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

అరకులోయలో 'సంక్రాంతికి వస్తున్నాం'


- స్కూల్స్‌లో, వలిసెపూలు, మంచు అందాల్లో షూటింగ్
- హీరో వెంకటేష్, హీరోయిన్లపై చిత్రీకరణ


అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షూటింగ్ సందడి

అరకులోయ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో పర్యాటకులతోపాటు సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అగ్రహీరో వెంకటేష్, హీరోయిన్‌లు మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా షూటింగ్ గత వారం రోజుల నుంచి అరకులోయలో జరుగుతోంది. ఇప్పటివరకు అరకులోయ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ పబ్లిక్ స్కూల్, రణజిల్లెడ జలపాతం, వలిసెపూలు, మంచు అందాల నడుమ పలురకాల సీన్స్ పాటలను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించారు. వీరంతా టూరిజంకు చెందిన హరిత రిసార్టులో బస చేసి ప్రతి రోజూ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి నిర్మాత దిల్ రాజు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు


గ్లోబల్ అఖండ భజనలో పాల్గొన్న భక్తులు


దీపాలంకరణలో సత్యసాయి మందిరం

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకలను ఎంవీపీ కాలనీలోని ప్రేమ సదన్ మందిర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ అఖండ భజనలో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు భజన ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకూ నిరంతరాయంగా కొనసాగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాల్లో సత్యసాయి భక్తులు, ఆరాధకులు ఈ భజనలో పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భజనకు ముందు వేదపఠనం, అష్టోత్తరం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సిటీ కన్వీనర్ డీవీవీ సీతారామరాజు అఖండ భజనను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై అభ్యంతరకర పోస్టులు

- పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త

కూర్మన్నపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌ల ఫొటోలను మార్ఫింగ్ చేసి పొలిటికల్ పంచ్ వాట్సాప్ వెబ్ ఛానల్, ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారనే ఫిర్యాదు మేరకు వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు దువ్వాడ పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

యాదవజగ్గరాజుపేటకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ బోడి వెంకటేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఆ కేసులో ఏ-2గా ఉన్న మధురవాడ ధర్మపురి కాలనీకి చెందిన ఇంటూరి రవికిరణ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వైసీపీ కార్యకర్త అయిన రవికిరణ్ 2019 నుంచి 2024 జూన్ వరకూ ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో కంటెంట్ రైటర్‌గా నెలకు రూ.75 వేలు జీతానికి పని చేసేవాడన్నారు. తిరుమల శ్రీవారి భోజనంలో చనిపోయిన జెర్రి కనిపించిందని, వరద బాధితులకు సాయం పంపిణీలో అవినీతి జరిగిందని ప్రభుత్వంపై రవికిరణ్ అసత్య ప్రచారం చేసినట్టు కృష్ణా జిల్లా గుడివాడ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు.

కేసు దర్యాప్తులో భాగంగా దువ్వాడ పోలీసులు రవికిరణ్‌కు 41ఏ నోటీసులు ఇచ్చి ఈ నెల 11న మేజిస్ట్రేట్ ముందు హాజరు కావాలని చెప్పి, పంపివేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అమరేంద్ర

పెదవాల్తేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షానికి విజయవాడలోని నీటి మునిగిన సమయంలో సేవలు అందించిన పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతలు దుస్తులు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం చినవాల్తేరులోని 21వ వార్డు పారిశుధ్య కార్యాలయం వద్ద 22 మంది పారిశుధ్య కార్మికులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో కార్మికులు అందించిన సేవలు అమోఘమన్నారు.

సమయ పాలనలో తాత్సారం వద్దు

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు


అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ సమయానికే ప్రయాణికుల కోసం బస్సులను అందుబాటులో ఉంచాలని, దీనివల్ల వారికి ఆర్టీసీ బస్సుల పట్ల నమ్మకం పెరుగుతుందని సంస్థ రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు అధికారులు, సిబ్బందికి సూచించారు. వాల్తేరు, మధురవాడ డిపోల్లో శనివారం ఆయన డిపోల ఆవరణలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. బస్టాపుల్లో ఏర్పాటు చేసిన బస్సుల రాకపోకల టైమింగ్ బోర్డులను ప్రయాణికులు గమనించి, ఆ సమయాలకు బస్టాపులో వేచి ఉంటారన్నారు. అయితే సూచించిన సమయానికి బస్సులు రాకపోయినా, ఆ సమయాని కన్నా ముందు వచ్చి వెళ్లిపోయినా ప్రయాణికులు అసహనానికి గురై ప్రత్యామ్నాయ రవాణా సాధనాలను ఆశ్రయిస్తారని, ఆర్టీసీ బస్సులపై కూడా నమ్మకం కోల్పోతారన్నారు. స్టూడెంట్ పాస్‌లు ఉన్న విద్యార్థులకు సకాలంలో రవాణా సేవలందించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. సాధారణ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు రవాణా సౌకర్యాలను అందించాలని అప్పలనాయుడు పేర్కొన్నారు. ఆర్టీసీ విశాఖ రీజియన్ ప్రవేశపెట్టిన పంచారామాల క్షేత్రదర్శని ప్యాకేజీకి మంచి స్పందన వస్తుందన్నారు. శబరిమలై యాత్రకు కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, మధురవాడ డిపో మేనేజర్ రాజు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో ఆశీళ్ల దందా!

చిరు వ్యాపారుల నుంచి బలవంతపు వసూళ్లు

జగదాంబ కూడలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలుకు కాంట్రాక్టు సిబ్బంది జులుం ప్రదర్శిస్తుండడంతో చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై జంగిళ్లతో వ్యాపారాలు సాగించే వారి నుంచి కూడా బలవంతరగా ఆశీలు వసూలుకు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ లోపల, రోడ్డుమీద చిరువ్యాపారాలు సాగిస్తున్న వారితో పాటు పార్కింగ్ స్థలానికి సంబంధించిన ఆశీలు కాంట్రాక్టును జోన్-4 అధికారులు ఖరారు చేసి బాధ్యతలు అప్పగించారు. రోడ్డుపై చిరు వ్యాపారాలు సాగించే వారితో పాటు కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఆశీలు వసూలు బాధ్యతను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ సిబ్బంది రోడ్డు పైన వ్యాపారాలు సాగిస్తున్న వారి నుంచి నిర్బంధంగా వసూళ్లకు పాల్పడుతున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారి దగ్గర రోజువారీ ఆశీలు రూ.20 వసూలు చేయాల్సి ఉండగా, రూ. 150 వరకు డిమాండ్ చేస్తున్నట్టు పూలు విక్రయిస్తున్న ఓ మహిళ ఆవేదన వ్యక్తంచేశారు. చెల్లించకుంటే పూల బుట్టలను విసిరేస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. పండుగ సందర్భాల్లో రోడ్డుపై వ్యాపారుల నుంచి జంగిడికి రూ.150 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మార్కెట్‌లో ఆశీలు కాంట్రాక్టు వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, టీడీపీ నాయకులు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడడంపై సీపీఎం నేతలు నిలదీశారు. దీంతో సంబంధిత ఆశీలు కాంట్రాక్టును జీవీఎంసీ ఉన్నతాధికారులు నిలిపేశారు. అప్పట్లో తీవ్ర విమర్శలు గుప్పించిన వార్డు ప్రజాప్రతినిధి అనుచరగణం ఇప్పుడు అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడం గమనార్హం. జీవీఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాయంత్రం సమయంలో పార్కింగ్ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆశీలు కాంట్రాక్టర్ అక్రమ దందా పై పలువురు వ్యాపారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. అక్రమ వసూళ్లకు జీవీఎంసీ జోన్ 4, రెవెన్యూ అధికారులు అడ్డుకట్టవేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


పూర్ణామార్కెట్‌లో రోడ్డుపె వ్యాపారం చేసుకుంటున్న మహిళలు

ఫుట్‌బాల్ సంఘంలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అండదండలు, రాజకీయ పలుకుబడితో కొందరు ఫుట్‌బాల్ క్రీడారంగంలోకి చొరబడి వర్ధమాన ఔత్సాహిక ఫుట్‌బాలర్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ఏపీ ఫుట్‌బాల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, వాల్తేరు ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, క్రీడాప్రాధికార సంస్థ, కూటమి ప్రభుత్వ పెద్దలు వాస్తవాలను గుర్తించి అనధికార సంఘాన్ని రద్దు చేసి వాల్తేరు ఫుట్‌బాల్ సంఘానికి సహకరించాలని కోరారు. దీనిపై అన్ని ఆధారాలతో కలెక్టర్, శాప్, క్రీడా మంత్రికి వినతిపత్రం అందజేశామని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ ఫుట్‌బాల్‌తో ఎటువంటి అనుబంధం లేని కొందరు వ్యక్తులతో ఏలూరు వైసీపీ మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ కలిసి ఆర్థిక, అధికార బలంతో దొడ్డిదారిన విశాఖలో చట్ట విరుద్ధంగా ఫుట్‌బాల్ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి క్రీడాకారులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అప్పటి క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, ఏఐఎఫ్ఎఫ్ ప్రతినిధులకు తప్పుడు సమాచారమిచ్చారని ఆరోపించారు.

కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

భర్త, అత్తమామల అరెస్టు

సీతంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త, మామల వేధింపులు భరించలేక ఓ మహిళ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ద్వారకా పోలీసుస్టేషన్ పరిధి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో సత్యప్రియ (31), ఇల్లిశెట్టి కార్తికేయ (38) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. సత్యప్రియకు కట్నకానుకలుగా వివాహ సమయంలో రూ.4.5 కోట్లు, బంగారం, పెళ్లి ఖర్చుల కింద రూ.కోటి మొత్తాన్ని ఇల్లిశెట్టి కార్తికేయ కుటుంబ సభ్యులకు సత్యప్రియ తల్లిదండ్రులు శైలజ, సూర్యచంద్రరావులు ముట్టజెప్పారు. వివాహమైనప్పటి నుంచి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని కృపా నిలయంలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా సత్యప్రియపై భర్త కార్తికేయతో పాటు అత్తమామల వేధింపులు మొదలయ్యాయి. ఆమెను అనుమానించడమే కాక, ఇంకా కట్నం కావాలని వేధించడం మొదలు పెట్టారు. దీంతో సత్యప్రియ కొద్ది రోజుల క్రితం తల్లికి ఫోను చేసి తన బాధను తెలిపింది. అత్తమామలతో పాటు భర్త వేధింపులు అధికమవడంతో సత్యప్రియ శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన కార్తికేయ పడక గదిలో సత్యప్రియ ఉరేసుకుని ఉండడం చూసి తల్లిదండ్రులకు చెప్పాడు. సత్యప్రియ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లికి సమీప బంధువులు ఫోనులో సమాచారం అందించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నవారు కన్నీరు మున్నీరై తమ కుమార్తె చావుకు అల్లుడు కార్తికేయ, వారి తల్లిదండ్రులే కారకులంటూ ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వెంకటరమణ కేసు నమోదు చేపట్టారు. వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. సత్యప్రియకు పోస్టుమార్టం నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కార్తికేయను, అతని తల్లిదండ్రులు శైలజ, సూర్యచంద్రరావులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.

'పారిశుధ్య సిబ్బంది సేవలు శ్లాఘనీయం'


పారిశుధ్య ఉద్యోగినికి చీర అందజేస్తున్న కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని గ్రేటర్ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. వార్డులో పారిశుధ్య సేవలు అందజేస్తున్న మహిళా సిబ్బందిని నేరెళ్ల కోనేరు వద్ద గల జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ఘనంగా సన్మానించి వారికి చీరలు అందజేశారు. ఇటీవల విజయవాడ వరద ప్రాంతాల్లోనూ విశేష సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాశీరావు, కూటమి నాయకులు నారా నాగేశ్వరరావు, మంత్రి శాలివాహన, కొట్టాల రమేష్, కుందుల బద్రీ, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

అతి తక్కువ బరువుతో శిశువు జననం


ఆరోగ్యంగా ఉన్న శిశువుతో వైద్యబృందం

మహారాణిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అతి తక్కువ బరువుతో పుట్టిన శిశువుకు మెరుగైన వైద్యం అందించిన వైద్యులు ప్రాణం నిలబెట్టారు. మహారాణిపేటలోని మెడికవర్ మదర్ అండ్ చైల్డ్ విభాగం ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ప్రముఖ నియోనెంటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. విజయనగరం వాసి రమాదేవికి 25 వారాల గర్భదారణ సమయంలోనే (నెలలు నిండకుండా) అనారోగ్య పరిస్థితి నెలకొనటంతో ప్రీమెచ్యూర్ బేబీ జన్మించింది శిశువు కేవలం 510 గ్రాముల బరువు ఉండడంతో ఊపిరితిత్తులు, అవయవాలు అపరిపక్వంగా ఉండటంతో రోగనిరోధక శక్తి తగ్గి ఇన్‌ఫెక్షన్లు వచ్చాయి శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో 25 రోజులు ఇన్వాసిన్ వెంటిలేషన్‌లో ఉంచారు. కృత్రిమపద్ధతిలో పాలు, పోషకాలు అందించారు. సుమారు 107 రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండడంతో 1.65 గ్రాముల బరువు పెరిగింది. అన్ని అవయవాలు పనిచేయటంతో పాటు సహజసిద్ధంగా ఆహారం తీసుకోవటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు తెలిపారు,

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి

అల్లిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం పరిధి 34వ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానిక జనసేన వార్డు అధ్యక్షుడు వాసుపల్లి రమేష్, ఇంచార్జ్ నారా నాగేశ్వరరావులు శనివారం ఏపీఈపీడీసీఎల్ ఏఈ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చాలా చోట్ల లోవోల్టేజ్ కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయని, కొన్నిచోట్ల స్తంభాలపై వైర్లు కనిపించడం లేదని, సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఏఈ హామీ ఇచ్చారు.

'కథా రచనలో కారా శైలి ప్రత్యేకం'


కాళీపట్నం రామారావు మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కథా రచనలో కాళీపట్నం రామారావు (కారా మాస్టారు)ది ప్రత్యేక శైలి అని సుప్రసిద్ధ రచయిత వివినమూర్తి అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రైటర్స్ అకాడమీ, సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కథా రచయిత కాళీపట్నం రామారావు శతజయంత్యుత్సవ సదస్సు నిర్వహించారు. తెలుగు సలహా మండలి కన్వీనర్ డాక్టర్ సి.మృణాళిని అధ్యక్షత వహించిన సదస్సులో తొలుత కాళీపట్నం రామారావు మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివినమూర్తి మాట్లాడుతూ పతంజలి, హరినాథ్ లకు కారాతో ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. కారాకు పల్లెటూర్లు అంటే ఇష్టమన్నారు. అక్కడ వాస్తవిక ప్రపంచం కనిపిస్తుందని అభిప్రాయపడేవారన్నారు. నగరంలోనూ, పల్లెల్లోనూ తేడాలను కారా మాస్టర్ పరిశీలించేవారని తెలియజేశారు. విజ్ఞానాన్ని అవగాహన చేసుకుని రచనలు చేసేవారన్నారు. ఏ వస్తువు ఎవరి దగరకు వచ్చినా అందులో శ్రమ ఉంటుందని రామారావు చెప్పేవారని తెలిపారు. రచయిత బాధ్యతాయుతంగా ఉండాలని భావించేవారని తెలిపారు. తెలుగు సలహా మండలి కన్వీనర్ డాక్టర్ మృణాళిని మాట్లాడుతూ బాధ్యత తెలిసిన కథకుడు రామారావు అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొలిపేలా కాళీపట్నం రచనలు ఉండేవన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ కారా కథలు సజీవంగా ఉంటాయన్నారు. పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ ఉత్తర నియోజకవర్గం 14వ వార్డు అధ్యక్షులు గొంప ధర్మరావు, పీవీ వసంతరావు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించారు. సభ్యత్వాలు నమోదు చేసుకోడానికి చాలా మంది ఆసక్తి చూపించడంతో రాత్రి వరకు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకురాలు జె.హేమ, సిహెచ్ దేవుడు, ఎ.శ్రీనివాసరావు, పుల్లేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణవ్‌గోపాల్‌కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ పీఠం

... 5వ పేజీ తరువాయి

విజయం సాధించారు. 2009లో కొత్తగా ఏర్పడిన పెందుర్తి నుంచి టికెట్ ఇచ్చినా ఓటమి చెందారు. 2014లో వైసీపీ తరఫున పెందుర్తి నుంచి పోటీ చేసి ఓటమి చెందిన తరువాత తెలుగుదేశం పార్టీలో చేరారు. 2021లో ఉమ్మడి జిల్లాలోని విశాఖ దక్షిణ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గ టిక్కెట్‌ను తెలుగుదేశం పార్టీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. దీంతో బాబ్జీ మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేయగా...విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సర్దిచెప్పారు. అనంతరం విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా, పెందుర్తి నియోజవర్గ ఇన్‌చార్జిగా బాబ్జీ నియమితులయ్యారు. న్యాయ శాస్త్రం అభ్యసించిన బాబ్జీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీతంరాజు సుధాకర్

నగరంలోని శ్రీహరిపురానికి చెందిన సీతంరాజు సుధాకర్ విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసిత కుటుంబానికి చెందిన వ్యక్తి. తరువాత అదే ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టర్‌గా వ్యాపార జీవితం ప్రారంభించారు. ఇంకా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అడుగుపెట్టిన సుధాకర్ 1992లో యువజన కాంగ్రెస్ నాయకునిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రులు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డితో సన్నిహితంగా ఉండేవారు. 2014లో వైసీపీలో చేరారు. అరకులోయ, అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. గత ఏడాది ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన సుధాకర్ ఈ ఏడాది సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. తరువాత విశాఖ దక్షిణ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. డిగ్రీ చదువుకున్న సుధాకర్ వయస్సు 53 సంవత్సరాలు, ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

రైతుల అభ్యున్నతికి కృషిచేస్తా

రాష్ట్రంలో నూనెగింజలు పండించే రైతుల అభ్యున్నతికి కృషిచేస్తా. వేరుశనగ, పామాయిల్, సన్‌ఫ్లవర్ పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సంస్థ వ్యాపారం పెరిగేలా కార్యాచరణ రూపొందిస్తా. నాపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువతనేత నారా లోకేశ్‌కు ధన్యవాదాలు **-గండిబాబ్జీ, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్**

పేదలకు మెరుగైన వైద్య సేవలు

పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవ సంస్థ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తా. ఆస్పత్రుల్లో జాప్యం చోటుచేసుకోకుండా చూస్తాం. ఈ పదవి ఇచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్, యువనేతకు ధన్యవాదాలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్‌లు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. **-సీతంరాజు సుధాకర్, ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్**

నగర అభివృద్ధికి కృషి

రాష్ట్రంలోనే అతి పెద్ద నగరం విశాఖ అభివృద్ధికి బృహత్తర ప్రణాళికలు రూపొందించి అమలుచేసేందుకు కృషిచేస్తా. ఇప్పటికే నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటా. శివారు ప్రాంతాల్లో కొత్త టౌన్‌షిప్‌లు ఏర్పాటుకు ప్రతిపాదిస్తాం. నగరం, శివారు ప్రాంతాల్లో అన్ని వర్గాలకు మౌలిక వసతులు కల్పిస్తాం. దిగువ మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా లేఅవుట్‌లు అభివృద్ధి చేసి ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తా. పర్యాటకులను ఆకట్టుకునేలా నగరంలో కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువస్తాం. నాపై ఎంతో నమ్మకం ఉంచి పదవి అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్‌కు ధన్యవాదాలు **-ఎం.ప్రణవ్‌గోపాల్, చైర్మన్,వీఎంఆర్‌డీఏ**

43 మంది ఇళ్ల డబ్బు వాపసు


చెక్కులు పొందిన వారితో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇంటి కోసం ప్రభుత్వానికి డబ్బు కట్టినా ఇల్లు, డబ్బు రెండూ రాకపోవడంతో చాలా మంది బాధలు పడ్డారని, కూటమి ప్రభుత్వం వారి డబ్బును వెనక్కి ఇచ్చిందని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో శనివారం 43 మందికి చెక్కురూపంలో రూ.9,01,000 అందజేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వ హయాంలో వీరికి ఇళ్ల మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ రాము, ఏపీడీ పుణ్యవతి, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక తదితరులు పాల్గొన్నారు.

'స్టేషన్ బెయిల్ ప్రక్రియతో న్యాయానికి అవరోధం'


సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ అహ్మద్, ఇతర న్యాయవాదులు

డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ బెయిల్ విధానం పోలీసులకు విస్తృత అధికారాలిస్తూ, న్యాయవ్యవస్థ అధికారాలను కుదిస్తోందని న్యాయవాదుల సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ లాయర్స్ ఫోరం చాంబర్‌లో శనివారం 41ఏ సీఆర్‌పీసీ స్టేషన్ బెయిల్ ప్రక్రియపై చర్చా కార్యక్రమాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణ్‌కుమార్ సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం కన్వీనర్ ఐ.ఎం.అహ్మద్ మాట్లాడుతూ తీర్పు తప్ప అన్ని అధికారాలను విచారణ పేరుతో పోలీసులకు అప్పగించడం దుర్వినియోగానికి కారణమవుతోందని అభిప్రాయపడ్డారు. ఫోరం అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు, అధికార దుర్వినియోగం ఆపడానికి తక్షణమే స్టేషన్ బెయిల్ విధానాన్ని తొలగించి పాత బెయిల్ పద్ధతిని పెట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది టి.బోస్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఉద్యమాన్ని ఫోరం ఆధ్వర్యంలో చేపట్టి విజయం సాధించామని గుర్తుచేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణకుమార్ తన సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాల్తేరు నూతన ఏడీఆర్ఎంగా శాంతారామ్ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నూతన అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా (ఏడీఆర్ఎం) శాంతారామ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. 2004 ఇండియన్ రైల్వే సర్వీసు ఆఫ్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఈ) బ్యాచ్‌కు చెందిన శాంతారామ్...హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్, విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంటీఏ పూర్తి చేశారు. సౌత్ ఈస్ట్రన్ రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వే, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ల పరిధిలోని పలు కీలక శాఖలలో పనిచేసి ట్రాక్ నిర్వహణ, నిర్మాణ ప్రాజెక్టులలో తనదైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రైల్వే ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌లో విశేష అనుభవం ఉన్న శాంతారామ్...రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీసెస్ (ఆర్ఐటీఈఎస్) ద్వారా మలేషియాలోని రైల్వే ప్రాజెక్టులలోనూ పనిచేసిన అనుభవం ఉంది. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్‌లో డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా, విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్)గా నాలుగేళ్లు పనిచేసి బదిలీపై వాల్తేరు డివిజన్ ఏడీఆర్ఎంగా (ఇన్‌ఫ్రా) వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా)గా పనిచేసిన సుధార్‌కుమార్ గుప్తా సెంట్రల్ రైల్వేకు బదిలీ అయ్యారు.

'బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలి'


ప్రజాసంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సంగటి మనోహర్ మహాజన్

సీతంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలని, ఈవీఎంల ద్వారా ట్యాంపరింగ్‌కు అవకాశం ఉందని పలు సంఘాల ప్రతినిధులు, పార్టీల నేతలు అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల అక్రమాలు, ఈవీఎంలలో అవకతవకలు, ఏకకాలంలో జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తూ రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో శనివారం పలు దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, సమన్వయకర్త సంగటి మనోహర్ మహాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి. ప్రభాకర్, విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, అడ్వైజర్ ఎస్ఆర్ వేమన, భారత్ సమాజ్ డెవలప్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చింతాడ సూర్యం, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సుధాకర్, నవయానం బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈవీఎంల ద్వారా ఏ రకంగా ట్యాంపరింగ్ చేయవచ్చనే విషయాన్ని అనేక మంది నిపుణులు నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలోనూ మన దేశంలో బ్యాలెట్ పత్రాలు ఉండేవని పేర్కొన్నారు. గతంలో 40 వేల ఈవీఎంలు కనిపించలేదని, అవి ఎలా మాయమయ్యాయనే ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నుంచి సమాధానం లేదన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని మార్చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటూ రాజ్యాధికారం కావాలని దళిత, బహుజన మహాజన, లౌకిక పార్టీలన్నీ ఏకం కావాలని స్పష్టం చేశారు. పలు ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడారు.

ఉక్కుకు పొంచి ఉన్న ముప్పు

... 5వ పేజీ తరువాయి

ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 14,290 మంది ఉన్నారు. అంటే మిలియన్ టన్నుకు 2,041 మంది ఉన్నారు. విశాఖ స్టీల్‌తో పోలిస్తే మిలియన్ టన్నుకు 300 మంది ఎక్కువ ఉన్నారు. పైగా ఏటా 250 మందిని కొత్తగా తీసుకుంటున్నారు.

లాభాలు ఎలా వస్తాయి?

సెయిల్‌తో సమానంగా లాభాలు తీసుకురావాలని, దీనికి కార్మికులు తీవ్రంగా కృషిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సెయిల్‌కు సొంత గనులు ఉన్నాయి. నిధులకు కొరత లేదు. ఉద్యోగుల సంఖ్య అవసరమైనంత ఉంది. పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే లాభాలు వస్తున్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితి దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. ఇక్కడ ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి తాము సిద్ధంగా ఉన్నామని కార్మిక సంఘాలు చెబుతుంటే...అందుకు అవసరమైన ముడి పదార్థాలు, నిధులు సమకూర్చడానికి కేంద్రం ముందుకురావడం లేదు. ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసులకు రెండు మూతపడ్డాయి. పది రోజుల క్రితమే ఒకటి పునఃప్రారంభించారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ గురించి మాట్లాడడం లేదు. తమకు రూ.15 వేల కోట్ల సాయం చేస్తే పూర్తి ఉత్పత్తి సాధిస్తామని, సంస్థను లాభాల్లోకి తెస్తామని కార్మిక సంఘాలు చెప్పాయి. ఇదే విషయం కేంద్రానికి తెలిపాయి. కానీ ఉక్కు మంత్రిత్వ శాఖ అడిగిన మొత్తంలో కేవలం పది శాతం రూ.1,650 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. దాంతోనే లాభాలు తేవాలని చెబుతోంది. ఇది పూర్తిగా అసాధ్యం. ఇలాగే కొనసాగితే మరో నాలుగు నెలల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. రూ.వేల కోట్ల రూపాయల నష్టం వస్తుంది. తాము సాయం చేసినా లాభాలు తేలేకపోయారని అపవాదు వేసి ప్లాంటును వేరే వారికి అప్పగించేందుకు ఇప్పటి నుంచే మార్గం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెయిల్‌తో పోలికా?

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో భిలాయ్, రూర్కెలా, బొకారో, బర్నాపూర్, దుర్గాపూర్‌లతో పాటు సేలం, భద్రావతి మరో రెండుచోట్ల ప్లాంట్లు ఉన్నాయి. సెయిల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 20 మిలియన్ టన్నులు. ఉద్యోగుల సంఖ్య 54,412. మిలియన్ టన్నుకు 2,721 మంది ఉన్నారు. విశాఖ ఉక్కును చూసుకుంటే మిలియన్ టన్నుకు 1,717 మందే ఉన్నారు. అంటే వేయి మంది తక్కువగా ఉన్నారు. సెయిల్‌కు అన్ని వసతులు ఉన్నాయి. దాంతో పోల్చి అలా పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అది ఎలా సాధ్యమని విశాఖ కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ముడి పదార్థాల కొరత లేకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మిగిలిన ప్లాంట్లలాగే తాము కూడా పనిచేస్తామంటే దాని గురించి మాట్లాడడం లేదు. ఇదే విధానం కొనసాగిస్తే విశాఖ ఉక్కును నడపడం కష్టమని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

మళ్లీ తెరపైకి కోస్టల్ కారిడార్

... 5వ పేజీ తరువాయి

కొన్ని అంగీకారాలు కుదిరాయని జిల్లా అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

- ఈ ప్రాజెక్టుకు భూ సేకరణకు రూ.4,315 కోట్లు, నిర్మాణాలకు రూ.1,974 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు.
- భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,200 కోట్లు భరించడానికి ఒప్పుకొంది. మిగిలిన మొత్తం కేంద్రం పెట్టుకోవాలి.
- నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీ మినహాయింపు

త్వరలోనే డీపీఆర్ పూర్తి

ఈ కోస్టల్ కారిడార్ డీపీఆర్‌కు గత ఏడాది ఆగస్టులోనే రూ.1.45 కోట్లు మంజూరుచేశారని, ప్రస్తుతం డీపీఆర్ తయారు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి చేసి కేంద్రానికి సమర్పిస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఇది పూర్తయితే కేంద్ర ప్రతినిధులతో చర్చించి, ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళతామని సీఎం పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం విశాఖలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ఈ ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని నాటి రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీ సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇందులో భీమునిపట్నం నుంచి భోగాపురం వరకు 19.66 కి.మీ. పొడవున గ్రీన్ ఫీల్డ్ కారిడార్ వేయాలని నిర్ణయించారు. పట్టణంలో పురాతన కట్టడాలు కూల్చాల్సి వస్తుందని చెప్పి కారిడార్ మలుపు తిప్పారు. ఈ మార్గంలో వైసీపీ నాయకులు కొన్ని వందల ఎకరాలు సొంతం చేసుకున్నారు.

మహారాష్ట్ర ఎన్నికల సమన్వయకర్తగా నారాయణరావు



డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమన్వయకర్తగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీఏ నారాయణరావును ఏఐసీసీ నియమించింది. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న కొల్హాపూర్ జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల బాధ్యతలు తనకు అప్పగించడంపై ఏఐసీసీ ప్రముఖులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సౌండ్ సైలెన్సర్లు ధ్వంసం

... 5వ పేజీ తరువాయి

182 వాహనాలకు ఉన్న మాడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటినీ శనివారం బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయం ఎదురుగా రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఇలాంటి మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగించడం మోటారు వాహనాల చట్టం-1998 సెక్షన్ 190 ప్రకారం నేరమన్నారు. మాడిఫైడ్ సెలెన్సర్లు అమర్చిన వాహనాలతో పట్టుబడితే మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ.పది వేలు జరిమానా విధిస్తారన్నారు. రెండోసారి పట్టుబడితే వాహనం సీజ్ చేసి, వాహనం నడిపేవారి లైసెన్స్‌ను ఆరు నెలలు సస్పెండ్ చేయడంతోపాటు మూడు నెలలు జైలు శిక్ష, రూ.పది వేల జరిమానాకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా సెప్టెంబరు ఒకటి నుంచి హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన 70,500 మంది లైసెన్స్‌లను మూడు నెలలు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాల్సిందేనని సీపీ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు మేరీప్రశాంతి, అజితా వేజెండ్ల, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

79 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలు, బుల్లెట్‌తో పోలీసులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెంలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నుంచి 79 మద్యం సీసాలను గాజువాక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కిరెడ్డిపాలెం ప్రాం తానికి చెందిన బుదిరెడ్డి అప్పారావు అక్రమంగా మద్యం బాటిళ్లను నిల్వ ఉంచారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలతో పాటు రూ.5,060 నగదు, బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్యాబ్ డ్రైవర్ అదృశ్యం

పెందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్యాబ్‌ను బుక్ చేసుకున్న ప్రయాణికులను ఎక్కించుకునేందుకు కారులో ఇంటి నుంచి బయలుదేరిన డ్రైవర్ అదృశ్యమైనట్టు శనివారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలోని మైత్రినగర్‌కు చెందిన గణేశ్‌కుమార్(41) క్యాబ్ డ్రైవర్. అరకుకు క్యాబ్ బుకింగ్ చేసుకున్నారని, ప్రయాణికులను తీసుకువెళ్లాలని చెప్పి ఇంటి నుంచి కారులో అక్టోబరు 28న ఉదయం ఐదు గంటలప్పుడు బయలుదేరారు. అయితే అప్పటినుంచి గణేశ్‌కుమార్ ఇంటికి రాలేదు. ఆయన భార్య సునీత ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. గణేశ్‌కుమార్ కోసం అన్నిచోట్లా వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో మేక కళేబరం

మల్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోర్టు నుంచి ఖాళీగా కోరమాండల్ కంపెనీలోకి వచ్చిన గూడ్స్ రైలులోని ఓ వ్యాగన్‌లో ఉన్న మూట నుంచి భరించరాని దుర్వాసన రావడంతో కలాసీలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్లాస్టిక్ సంచి మూటలో ఎవరినో హత్య చేసి పెట్టి ఉంటారని అందరూ అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే వారు కోరమాండల్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడంతో వారు వచ్చి ఆ సంచిని చూసి మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విద్యసాగర్ సిబ్బందితో వచ్చి సంచిని విప్పి చూడగా అందులో మేక కళేబరం ఉంది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎవరో ఆకతాయిలు ఈ పని చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

శ్రీవారికి శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక తొలి శనివారం శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. అన్నదాతలకు అర్చకుడు శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. అలాగే 90వ వార్డు పరిధి విమానగర్‌లోని వేంకటేశ్వరాలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం:** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి:** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క:** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర:** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర:** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 32, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38,బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72,దేముడుచిక్కుడు 76, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

వార్డుల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 9: రాష్ట్రంలో నిధులు కొరత ఉన్నా సీఎం, డిప్యూటీ సీఎంలతో చర్చించి నిధులు రాబట్టి వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 97వ వార్డు పరిధిలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఆధ్వర్యంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిని ప్రజలు ఎప్పుడు గుర్తిస్తారన్నారు. వార్డుల్లో రూ.వంద కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శంకుస్థాపనలతో సరిపెట్టకుండా వంద రోజుల్లో ప్రారంభోత్సవాలను నిర్వహిస్తామన్నారు. పట్టణ, గ్రామీణవాసులతో మిళితమైన 97వ వార్డును అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్ది నంబర్‌వన్ వార్డుగా నిలుపుతామన్నారు. కార్పొరేటర్ సేనాపతి వసంత వార్డు అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం ఆయన పలు సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ముందుగా ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు మహిళలు హారతిలిచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

రూ.రెండు కోట్ల నిధులతో అభివద్ధి పనులకు శంకుస్థాపన

97వ వార్డు పరిధి సుజాతనగర్‌లోని గోపాలకృష్ణనగర్ వద్ద సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.19.30 లక్షలు, చినముషిడివాడలోని సత్య నగర్, గణేశ్ నగర్‌లో డ్రెయిన్లు, కల్వర్టుకు రూ.11.35 లక్షలు, పాత ఊరులో సీసీ డ్రెయిన్లు, కల్వర్టుకు రూ.15.50 లక్షలు, శ్రమశక్తి నగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.18.50 లక్షలు, కిశోర్ లేఅవుట్ వద్ద బీటీ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.19.80 లక్షలతో పాటు మరో 1.25 కోట్ల అభివృద్ధి పనులకు పంచకర్ల శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి శంకరరావు, జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్, శంకర ప్రసాద్, రమణమూర్తి, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



97వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పంచకర్ల రమేశ్‌బాబు

94వ వార్డులో..

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డులో రూ.కోటీ ఇరవై లక్షలతో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నో మార్పులను చూపించిన ఘనత సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు దక్కుతుందన్నారు. పురుషోత్తపురం, గౌతమ్‌నగర్, కృష్ణానగర్, అప్పలనర్సయ్య నగర్, వేపగుంట బీసీ కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు పంచకర్ల శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బొబ్బర నరసింహనాయుడు, వేణు, కిరణ్, ఆనంద్, దేముడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చీమలాపల్లిలో జరిగిన కార్యక్రమంలో గండి బాబ్జీ, తదితరులు



యాదవజగ్గరాజుపేటలో పాల్గొన్న గొలగాని సన్యాసిరావు, తదితరులు

టీడీపీ సభ్యత్వాలకు స్పందన భేష్: జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

పెందుర్తి-రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సభ్యత్వాల నమోదుకు విశేష స్పందన లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు అయితా ఎర్నిబాబు ఆధ్వర్యంలో 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో చేపట్టిన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పారంభించారు. సభ్యత్వాల నమోదు యాప్‌ను ఆవిష్కరించాక కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లల అప్పలనాయుడు, రోమాల శ్రీను, సీహెచ్ అప్పలరాజు, ఎం.శ్రీనివాసరావు, ఎ.సన్యాసిరావు, జి.సత్యనారాయణ, హరి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: టీడీపీ సభ్యత్వమంటే ఓ గౌరవమని 66వ వార్డు పార్టీ ఇన్‌చార్జి ఎండీ రఫీ, అధ్యక్షుడు మహమ్మద్ ముర్తజా అన్నారు. వార్డులో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గాజువాక ఎమ్మెల్యేను గెలిపించుకున్నామని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. నాయకులు గోమాడ వాసు, సీహెచ్ నాగేశ్వరరావు,వెంకటరావు, పైడిరాజు, సత్యనారాయణ, రతన్‌కాంత్ పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు కణితి సచివాలయంలో పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన రెండు జతల దుస్తుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఓ.అప్పారావు, సిబ్బంది మూర్తి, శ్రీను, గణేశ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక అన్నారు. నాయకులు పి.అశోక్,రమణ,వెంకటరావు,నరసింగరావు,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కణితిలో అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ నెట్‌బల్ పోటీలు

కూర్మన్నపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాల బాలికల నెట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండాను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అందరూ గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. బొండా జగన్ మాట్లాడుతూ తాను ఇదే స్కూలులో చదువుకుని ఈ స్థాయికి చేరుకుని.. ఇక్కడకు ముఖ్య అతిథిగా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులంతా క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలన్నారు. హెచ్ఎం బి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 312 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. మరో రెండు రోజులపాటు ఈ పోటీలు ఉదయం పది నుంచి రాత్రి పది వరకు కొనసాగుతాయన్నారు. నిర్వహిస్తామన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచే జట్లు డిసెంబరు రెండు నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సీహెచ్ రవీంద్రబాబు, ఎంఈవో సునీత, అరుణ్‌కుమార్, కోచ్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ట్రోఫీలను చూపిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, బొండా జగన్, తదితరులు

కాలుష్యంపై పీసీబీ అధికారుల ఆరా

మల్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 58వ వార్డు పరిధి ములగాడ, చిన్న ములగాడ, ఎదురువానిపాలెం, గొందేశివానిపాలెం ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు శుక్రవారం ఎనిమిది నుంచి పది గంటల వరకు పర్యటించి పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై ఆరా తీశారు. గ్రామంలోని అల్లూ ఫ్లోరైడ్, కోరమాండల్ ఎరువుల కర్మాగారం నుంచి కాలుష్యం వెలువడుతుందా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనేక మంది కాలుష్యాన్ని పలు పరిశ్రమలు విడుదల చేస్తుండడంతో రాత్రిళ్లు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, ఉదయం ఎండ వచ్చేంత వరకు బయటకు రాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం మూలంగా పలు వ్యాధుల బారిన పడుతున్నామని అధికారుల వద్ద వాపోయారు. కాలుష్యంపై సేకరించిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వారు పేర్కొన్నారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు



వెంకటేష్‌పై సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

అరకులోయలో 'సంక్రాంతికి వస్తున్నాం'

హీరో వెంకటేష్, హీరోయిన్‌లపై చిత్రీకరణ

స్కూల్స్‌లో, వలిసెపూలు, మంచు అందాల నడుమ షూటింగ్

అరకులోయ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో పర్యాటకులతోపాటు సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అగ్రహీరో వెంకటేష్, హీరోయిన్‌లు మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా షూటింగ్ గత వారం రోజుల నుంచి అరకులోయలో జరుగుతోంది. ఇప్పటివరకు అరకులోయ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ పబ్లిక్ స్కూల్, రణజిల్లెడ జలపాతం, వలిసెపూలు, మంచు అందాల నడుమ పలురకాల సీన్స్, పాటలను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించారు. వీరంతా టూరిజంకు చెందిన హరిత రిసార్టులో బస చేసి ప్రతి రోజూ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి నిర్మాత దిల్‌రాజు.

చీమలాపల్లిలో గౌరీపరమేశ్వరుల సారె సంబరం

పెందుర్తి-రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 9: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో నిర్వహిస్తున్న శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పూజలు నిర్వహించారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు యల్లపు పరదేశినాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం సారె సంబరాన్ని చేపట్టారు. వివిధ రకాల స్వీట్లు, ఇతర తినుబండారాలను మహిళలు ఊరేగింపుగా తీసుకువచ్చి గౌరీపరమేశ్వరులకు నైవేద్యంగా సమర్పించారు.

'ఉక్కు కర్మాగారం పరిరక్షణే ప్రధాన ధ్యేయం'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు రక్షణ కోసం ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలో చలనం లేనందున ప్రణాళికాబద్ధంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, కొవిరి అవతారం, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు

పెందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు చెకుముకి పేరిట నిర్వహిస్తున్న సైన్స్ వేడుకలను శనివారం పెందుర్తిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించగా, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి సైన్స్ సంబరాలు ఉపకరిస్తాయన్నారు. గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని అలవరిచేందుకు, సైన్స్ పట్ల ఆకర్షితులను చేసేందకు ఈ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రమూర్తి, ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్, సైంటిస్ట్ విజయ్‌కుమార్, శాస్త్రవేత్తలు విజయకుమరన్ రాధారాణి, నిర్మల, పద్మ తదితరులు మాట్లాడారు. కాగా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో పలువురు విద్యార్థులతో ముగ్గురు శాస్త్రవేత్తలతో మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు తీరంలోని సబ్‌మెరైన్, ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియంలను సందర్శించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, చెకుముకి కన్వీనర్లు ప్రసాద్, మురళీధర్, త్రిమూర్తులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా

సౌత్ ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు

అగనంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇష్టానుసారంగా వాహనాలను ఎవరైనా పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామని సౌత్ ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు హెచ్చరించారు. పెదమడకలోని ఉమామహేశ్వర ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులు రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తలెతున్నాయి. దీనిపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ట్రాఫిక్ ఏసీపీ స్వయంగా ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆలయానికి వచ్చే వాహనాలను పార్కింగ్ చేయడానికి వీలుగా స్థలాన్ని కేటాయించాలని కమిటీ ప్రతినిధులకు సూచించారు. రహదారిపై నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. న్నారు. ఆయన వెంట స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం

అధికారులు పట్టించుకోకపోవడంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు



87వ వార్డులో నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కూలీలు

కూర్మన్నపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కణితి ఎస్సీ కాలనీ వద్ద వడ్లపూడి సెక్టార్-1లో ఓ ప్లాట్‌ను ఆనుకుని ఉన్న సుమారు 75 గజాల ప్రభుత్వ భూమిని పలువురు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నా స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీ,టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ పత్రాలు సృష్టించి సృష్టించి సుమారు రూ.70 లక్షల విలువైన స్థలంలో అక్రమంగా నిర్మాణం జరుగుతున్నా సచివాలయ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రభుత్వ స్థల ఆక్రమణకు పాల్పడిన వారు శిక్షార్హులంటూ స్టీల్‌ప్లాంట్ భూ సేకరణ విభాగం అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి నిర్మాణం చేపట్టడం వివాదస్పదమైంది. ఈ నిర్మాణంపై వివాదాలు తలెత్తడంతో కొద్ది నెలల క్రితం పనులు నిలిపివేశారు. అయితే ఇప్పుడు సెలవు రోజుల్లో నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణం ఓ విలేకరి ఆధ్వర్యంలో జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. అలాగే ఈ నిర్మాణానికి సంబంధించి పలువురు అధికారులు, నాయకులకు మామూళ్లు ముట్టాయని, అందుకే ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై అభ్యంతరకర పోస్టులు

పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త

కూర్మన్నపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌ల ఫొటోలను మార్ఫింగ్ చేసి పొలిటికల్ పంచ్ వాట్సాప్ వెబ్ ఛానల్, ఫేస్‌బుక్, ఎక్స్, టెలీగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారనే ఫిర్యాదు మేరకు వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు దువ్వాడ పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదవజగ్గరాజుపేటకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ బోడి వెంకటేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఆ కేసులో ఏ-2గా ఉన్న మధురవాడ ధర్మపురి కాలనీకి చెందిన ఇంటూరి రవికిరణ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వైసీపీ కార్యకర్త అయిన రవికిరణ్ 2019 నుంచి 2024 జూన్ వరకూ ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో కంటెంట్ రైటర్‌గా నెలకు రూ.75 వేలు జీతానికి పనిచేసేవాడన్నారు. తిరుమల శ్రీవారి భోజనంలో చనిపోయిన జెర్రి కనిపించిందని, వరద బాధితులకు సాయం పంపిణీలో అవినీతి జరిగిందని ప్రభుత్వంపై రవికిరణ్ అసత్య ప్రచారం చేసినట్టు కృష్ణా జిల్లా గుడివాడ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా దువ్వాడ పోలీసులు రవికిరణ్‌కు 41ఏ నోటీసులు ఇచ్చి ఈ నెల 11న మేజిస్ట్రేట్ ముందు హాజరు కావాలని చెప్పి, పంపివేశారు.

వాహనాల చోరీపై ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్ల ఆందోళన

మల్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద శనివారం ఉదయం ట్యాంకర్ల సిబ్బంది ఆందోళనకు దిగారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలతో పాటు ఆయిల్ ట్యాంకర్లను, అందులో ఉన్న చమురును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారని, ఈ విషయంలో సంస్థ యజమాన్యం పట్టించుకోవడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం ఉండడం ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని, పార్కింగ్ ప్రదేశంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై సోమవారం యూనియన్ నాయకులందరూ సమావేశం కానున్నట్టు పలువురు డ్రైవర్లు తెలిపారు.

రెండు వాహనాల చోరీ కేసులను ఛేదించిన క్రైమ్ పోలీసులు

ఇదిలా ఉండగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీ ఎల్) వద్ద పార్కింగ్ చేసిన ట్యాంకర్‌ను దొంగలించిన వ్యక్తిని క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు 41 నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. హెచ్‌పీసీఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లు ఆందోళన చేసిన నేపథ్యంలో క్రైమ్ పోలీసులు ఈ కేసు వివరాలను శనివారం తెలిపారు. చుక్క ముత్యాలనాయుడు అనే వ్యక్తి తన ఆయిల్ ట్యాంకర్ కనిపించడం లేదని, క్లీనరే దొంగలించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు గతనెల 28న ఫిర్యాదు చేశారు. కాగా 29న ఆ ట్యాంకర్‌ను నక్కపల్లి టోల్‌గేటు సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు దొంగతనానికి పాల్పడిన కిరణ్‌కుమార్‌ను మల్కాపురం పోలీసులు అరెస్టు చేశారు. అలాగే మల్కాపురం ప్రాంతానికి చెందిన కృష్ణేశ్వరరావు తన క్రేన్‌ను గతనెలలో ఐఓసీఎల్ గేటు వద్ద ఉంచారు. తిరిగి ఈ నెల రెండున క్రేన్ వద్దకు వచ్చి చూడగా ఆపరేటింగ్ సిస్టమ్ కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, క్రేన్ పాత ఆపరేటర్ కొర్లయ్య దానిని దొంగలించినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులను క్రైమ్ ఎస్ఐ రమణ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బెహరా' కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

గోపాలపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెహరా ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయచైతన్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన విద్యాభ్యాసం చేయడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ బి.తరుణ్, ప్రిన్సిపాళ్లు సుకన్య, అనిల్, డాక్టర్ హిందుమతి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ బెహరా చైతన్య తదితరులు

ముగ్గురికి ఉత్తమ అధ్యాపకుల అవార్డులు

సిరిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన ఉత్తమ అధ్యాపకుల జాబితాలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు బోధన సిబ్బందికి చోటు లభించింది. వాణిజ్య శాస్త్ర విభాగం నుంచి డాక్టర్ డాక్టర్ మురళీధర్,మైక్రోబయాలజీ విభాగం నుంచి డాక్టర్ సీహెచ్ శాంతిదేవి, హిందీ విభాగం నుంచి డాక్టర్ బి.లక్ష్మికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఈ నెల 11న విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా వీరు అవార్డులను అందుకోనున్నారు. అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



అవార్డులకు ఎంపికైన డి.మురళీధర్, సీహెచ్ శాంతిదేవి, బి.లక్ష్మి

ఆరోగ్యానికి రక్ష టీకా



వ్యాక్సినేషన్‌తో ఎన్నోరకాల వ్యాధులకు అడ్డుకట్ట

- శరీరంలో వ్యాధి నిరోధక శక్తి అభివృద్ధి
- చిన్నారులకు టీకాలు వేయించడంలో అలసత్వం వద్దు
- ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా టీకా మందు

నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల అవగాహన దినోత్సవం



'నిండు జీవితానికి రెండు చుక్కలు'...పోలియో వ్యాక్సిన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ నినాదం. 'వ్యాధి వచ్చాక నివారణోపాయం కోసం ప్రయత్నించే కంటే ముందస్తు జాగ్రత్తే మేలు' సూత్రం నుంచి ఉద్భవించినదే 'టీకా' మందు. టీకా మందులన్నింటికీ ఈ నినాదం అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. ఎన్నో రకాల వ్యాక్సిన్‌లు సకాలంలో చిన్నారులకు వేయించడం ద్వారా పలు రోగాల నుంచి దూరం చేయొచ్చు. ఈ కారణంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చించి ఉచితంగా టీకా మందులను వేయిస్తున్నాయి. టీకా మందు ప్రాముఖ్యతను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకునేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒక్క టీకా ఎన్నో రోగాలకు చెక్ పెడుతుంది. రెండు చుక్కల మందు ప్రాణాంతక వ్యాధిని దూరం చేస్తుంది. టీకా మందు అంటే శరీరంలో రోగ నిరోధక శక్తిని అభివృద్ధి చేసే వ్యాక్సిన్. చిన్న వయసులో పిల్లల్ని వేగంగా రోగాలు ఆశ్రయిస్తాయి. కొందరికి పుట్టుకతోనే కొన్ని సమస్యలు వెంట వస్తాయి. వీటన్నింటికీ ఆదిలోనే అంతం పలికేందుకు ఉద్దేశించిందే టీకా మందు. టీకా వేయడం వల్ల బాల్యంలో వ్యాపించే రోగాలు విజృంభించకుండా ఉండేందుకు అవసరమైన రోగ నిరోధకశక్తిని శరీరంలో ఉత్పత్తి చేస్తాయి. ముఖ్యంగా క్షయ, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, కామెర్లు, మెదడువాపు, హిబ్ (న్యుమోనియా) వ్యాధుల నుంచి రక్షణకు టీకా ఎంతో ఉపయుక్తం. అంతటి విలువైన టీకాలను రూ.కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నా అవగాహన లోపం కారణంగా చాలామంది వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. టీకా మందుపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఏటా ఓ రోజును ప్రత్యేకంగా కేటాయించారు. నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం సందర్భంగా నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

టీకా అంటే?

టీకా లేదా వ్యాక్సిన్ అనేది వ్యాధి నిరోధక మందు. వ్యాధి కారక క్రిములు, సూక్ష్మజీవులు, వైరస్‌లు శరీరంలోకి చేరకుండా నిరోధించే మందు. ముందుగానే టీకా వేయడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక సామర్థ్యం అభివృద్ధి చెందుతుంది. పిల్లలే కాకుండా పెద్దలు కూడా కొన్నిరకాల టీకాలు వేయించుకోవడం ద్వారా పలు రకాల వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు.

గర్భిణులకు ఇచ్చే టీకా..

గర్భం దాల్చిన వెంటనే టీడీ-1 0.5 ఎంఎల్ తీసుకోవాలి. కండరాల ద్వారా చేతి పైభాగంలో దీనిని ఇస్తారు. మొదటి టీడీ తీసుకున్న నాలుగు వారాలకు టీడీ-2 0.5 ఎంఎల్ ఇస్తారు. టీడీ బూస్టర్‌ను మూడేళ్లలోపు మరోసారి గర్భం దాల్చితే టీడీ-2 డోస్ తీసుకున్న వారికి ఇస్తారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్

టీబీని నియంత్రించే ఉద్దేశంతో ప్రస్తుతం ట్రయల్ రన్ విధానంలో జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందిస్తున్నారు. 18 ఏళ్లు దాటిన వారికి స్మోకర్స్, డయాబెటిస్ బాధితులు, టీబీ



బాధితులు, టీబీ చికిత్స తీసుకుంటున్న వారి ఇంట్లో ఉన్న వారికి, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారికి ఈ వ్యాక్సిన్ ఇస్తున్నారు. టీబీని తగ్గించేందుకు దీన్ని ఇస్తున్నారు. లక్షన్నర మందికి జిల్లాలో ఇప్పటి వరకు అందించారు.

ఇదీ లక్ష్యం

కొన్ని రకాల టీకాలను పిల్లల వయసు బట్టి అందిస్తారు. ఆ సమయాన్ని మర్చిపోకుండా తల్లిదండ్రులు టీకాలు వేయించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పుట్టిన వెంటనే ఒకసారి, ఒకటో నెలలో రెండోసారి, రెండో నెలలో మూడోసారి, మూడో నెలలో నాలుగోసారి, తొమ్మిదో నెలలో ఐదోసారి, ఏడాదిలో ఆరోసారి, ఐదేళ్లలో ఏడోసారి టీకాలను చిన్నారులకు వేయించాలి. అంటే ఐదేళ్లలో ఏడుసార్లు చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాల్సి ఉంటుంది.

అవగాహన ఏర్పర్చుకోవాలి

వ్యాక్సినేషన్‌పై తల్లిదండ్రుల్లో అవగాహన తప్పనిసరిగా ఉండాలని వైద్య నిపుణులు, అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న టీకాల గురించి చిన్నారులు తల్లిదండ్రులు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులను అడిగి తెలుసుకోవాలి. జ్వరం, దగ్గు వంటి ఇబ్బందులు ఉన్నప్పుడు టీకాలను వేయించకుండా ఉండాలి. సాధారణంగా ఎన్ని టీకాలనైనా పిల్లలకు ఇవ్వొచ్చు. మళ్లీ నాలుగు వారాల వరకు టీకాలు ఇవ్వకూడదు. పల్స్ పోలియో కార్యక్రమం, రేబిస్ టీకాలకు ఈ షరతు వర్తించదు. టీకా వేయించిన తరువాత అరగంట వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దే వేచి ఉండడం మంచిది. ఎలాంటి ప్రతికూల చర్య కనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అన్ని టీకాలు ప్రతికూల చర్యలకు కారణం కానప్పటికీ ఏదైనా ఇబ్బంది కలిగితే వైద్యుడికి చూపించడం మంచిది.

వ్యాక్సినేషన్ల విషయంలో నిర్లక్ష్యం తగదు



పిల్లలకు ఇచ్చే వ్యాక్సినేషన్ల విషయంలో నిర్లక్ష్యం తగదు. తప్పనిసరిగా పిల్లలకు వ్యాక్సిన్లు ఇవ్వాలి. గర్భం దాల్చినప్పటి నుంచి, పుట్టిన బిడ్డకు ఐదేళ్లు నిండేంత వరకు వ్యాక్సినేషన్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను ఆశ కార్యకర్త గానీ, ఏఎన్ఎంగానీ తెలియజేస్తారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. నగర పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో వ్యాక్సిన్లు అందిస్తారు. పిల్లలకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్లు తప్పకుండా ఇచ్చేలా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి. వ్యాక్సినేషన్‌తో అనేక వ్యాధులు ముప్పును పిల్లలకు తొలగించే అవకాశం ఉంది.

– డాక్టర్ జీవనరాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

ఇవీ టీకాలు



జీరో డోసు: పుట్టిన వెంటనే శిశువుకు 24 గంటల్లోపు జీరో డోసు ఓపీవీ, బీసీజీ, హెపటైటిస్-బి వ్యాక్సిన్ టీలు ఇవ్వాలి.

బీసీజీ: పుట్టగానే లేదా వీలైనంత తొందరగా ఏడాదిలోపు ఈ వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుంది. బిడ్డ ఎడమ భుజానికి 0.5 ఎంఎల్ సూది మందు ఇస్తారు. దీని ద్వారా పిల్లల్లో ఊపిరితిత్తులు, మెదడు, ఇతర అవయవాలకు సంబంధించిన సమస్యలతోపాటు టీబీ రాకుండా కాపాడుకోవచ్చు.

హెపటైటిస్ బి: బిడ్డ పుట్టిన వెంటనే 24 గంటల్లోపు 0.05 ఎంఎల్ తొడ వెలుపలి భాగంలోని కండరానికి ఇస్తారు. దీనివల్ల కామెర్లు రావు. పెద్ద వయసులో వేధించే లివర్ సిర్రోసిస్ కేన్సర్లకు దూరం కావచ్చు.

ఓపీవీ: ఓపీవీ జీరో డోస్ వ్యాక్సిన్ పుట్టిన వెంటనే లేదా 15 రోజుల్లో రెండు చుక్కలు ఇవ్వాలి. ఓరల్ పోలియో వ్యాక్సిన్‌గా చెప్పే ఈ మందుతో పోలియోకు దూరం చేయవచ్చు.

రోటా వైరస్: పుట్టిన 6, 10, 14 వారాల తరువాత నోటి ద్వారా ఐదు చుక్కలు చొప్పున ఈ మందువేస్తారు. దీనివల్ల రోటా వైరస్ వల్ల కలిగే విరేచనాలకు రక్షణ లభిస్తుంది. హాస్పిటల్‌లో చేరి సెలైన్ ఎక్కించుకోవాల్సిన అవసరాన్ని, పోషకాహార లోపాన్ని తగ్గించుకోవచ్చు.

పెంటావాలెంట్ టీకా: ఇది అత్యంత ప్రధానమైన టీకా. ఈ టీకా ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. బిడ్డ పుట్టిన 6, 10, 14 వారాల్లో 0.05 ఎంఎల్ చొప్పున ఎడమ తొడ వెలుపలి నుంచి కండరాల్లోకి ఇస్తారు. ప్రధానంగా ఐదు వ్యాధుల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. కంఠసర్పి, కోరింత దగ్గు), శిశు పక్షవాతం, హెపటైటిస్ బి (కామెర్లు), హిమోఫీలిస్

ఇన్‌ఫ్లూయెంజా టైప్ బీ: (న్యుమోనియో, మెదడువాపు, చెవిటితనం) రాకుండా నివారిస్తుంది. ఏడాదిలోపు పిల్లలకు మాత్రమే ఈ టీకా ఇస్తారు.

మీజిల్ టీకా: తొమ్మిది నెలలు నిండిన చిన్నారులకు మీజిల్స్ (తట్టు) టీకా ఇస్తారు. 0.05 ఎంఎల్ చొప్పున కుడి భుజం చర్మం కింద చేస్తారు.

విటమిన్ ఏ ద్రావణం: ఈ ద్రావణాన్ని 16 నెలలు తరువాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెండు ఎంఎల్ చొప్పున మొత్తం తొమ్మిది డోసులు అందించాలి. ఐదేళ్ల వరకు అందిస్తారు. దీనివల్ల చిన్న వయసులో వచ్చే శ్వాసకోశ వ్యాధులైన జలుబు, దగ్గు, నిమ్మ, జీర్ణకోశ వ్యాధులైన విరేచనాలు, రేచీకటి, చర్మవ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

బూస్టర్ డోసు: 14-24 నెలలలోపు ఓపీవీ, డీపీటీ, డీపీటీ-1, మీజల్స్-2, జేఈ-2, విటమిన్ ఏ ద్రావణం ఇవ్వాలి.

స్పెక్ట్ మేనేజింగ్ ట్రస్టీ బాబూరావు మృతి



విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిఫూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) మేనేజింగ్ ట్రస్టీ, శరీర అవయవదాన ఉద్యమానికి పునాది వేసిన తొలి 35 మందిలో ఒకరైన డాక్టర్ కె.బాబూరావు శనివారం సాయంత్రం మృతి చెందారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆయన కళ్లను సేకరించింది. సోమవారం ఆయన భౌతికకాయాన్ని ఆంధ్ర వైద్య కళాశాలకు అందజేస్తామని స్పెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు.

మహిళా సాధికారతకు యూబీఐ చేయూత

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్ సుబ్రహ్మణ్యన్ వెల్లడి
- సీతమ్మధారలో నారీశక్తి శాఖ ప్రారంభం



సీతమ్మధారలో నారీ శక్తి బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న బ్యాంక్ అధికారులు

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతమ్మధారలో వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారీశక్తి శాఖను శనివారం ప్రారంభించారు. దేశంలో విశాఖతో పాటు బెంగళూరు, చెన్నై, జైపూర్, ముంబై నగరాల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వర్చువల్ విధానంలో నారీశక్తి శాఖలను ప్రారంభించారు. సీతమ్మధారలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్ సుబ్రహ్మణ్యన్, జోనల్ హెడ్ శాలిని మీనన్, రీజనల్ హెడ్ ఆర్.నరసింహ కుమార్, బ్రాంచి మేనేజర్ ఎం.ముకుంద ప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్ సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు తోడ్పాటు ఇవ్వటంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుంటుందన్నారు. నారీశక్తి ప్రత్యేక శాఖ ఏర్పాటు ద్వారా మహిళలు పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపార వేత్తలుగా రాణించడానికి రుణ సదుపాయం కల్పించడంతో పాటు నెట్ వర్కింగ్, నైపుణ్యాభివృద్ధికి కూడా సహకారం అందిస్తామన్నారు. జోనల్ హెడ్ శాలిని మీనన్ మాట్లాడుతూ ప్రత్యేక రుణ పథకాలు, కావలసిన వనరులు సమకూరుస్తామన్నారు. మహిళా సాధికారతతో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఉదయ్‌శంకర్, సుచిత స్మిత, సీహెచ్ రమేష్, జి.ఉమాపతి, బి.వినయ్, హరిబాబు, బ్యాంక్ అధికారులు, మహిళా ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీఏ ప్రతినిధులు

గవర్నర్‌ను కలిసిన ఏసీఏ నూతన కార్యవర్గం

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నూతన అపెక్స్ కార్యవర్గ సభ్యులు శనివారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ బాబు, కోశాధికారి డి.శ్రీనివాస్‌లు గవర్నర్‌ను కలిసి సంఘం కార్యకలాపాలను వివరించారు. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు జరుగుతున్నాయని, ఇతర కార్యకలాపాల పనులను ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళుతున్నామని వివరించారు.

ఈఎన్‌సీ చీఫ్‌ను కలిసిన ఒడిశా నేవీ అధికారి



ఈఎన్‌సీ చీఫ్ నుంచి జ్ఞాపికను అందుకుంటున్న దీపక్ అనిల్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒడిశా కమాండ్ నేవల్ ఇన్‌చార్జి బి.దీపక్ అనిల్ తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్‌ను శనివారం విశాఖపట్నంలో కలిశారు. డిసెంబరులో పూరీలో జరగనున్న బాలీ యాత్ర, నేవీ సాహస విన్యాసాల ప్రదర్శనపై వారు చర్చించారు. తీర ప్రాంతరక్షణ విన్యాసాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

సీవిజిల్-2024కు సన్నాహాలు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న సీవిజిల్ కార్యక్రమం కోసం సంబంధిత సంస్థల అధికారులతో శనివారం తూర్పు నౌకాదళంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సివిజిల్‌పై శిక్షణ ఇచ్చారు. తీర ప్రాంత రక్షణ, సమాచారం, నిఘా, గస్తీ, ముప్పును గుర్తించడం, దానిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడం, నిబంధనలు పాటించడం, సన్నద్ధత పెంచుకోవడం వంటి అంశాలను వివరించారు. ఇందులో మెరైన్ పోలీసులు, లైట్ హౌస్ నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో ఎండోక్రైనాలజీ వైద్యుల సదస్సు ముగింపు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హోటల్ నోవాటెల్‌లో జరుగుతన్న ఇసికాన్ సదస్సు ఆదివారంతో ముగియనున్నది. ఇందులో భాగంగా అంశాలపై చర్చించనున్నట్టు సదస్సు నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో దేశ, విదేశాలకు చెందిన వందలాది మంది వైద్యులు హాజరై అనేక అంశాలపై చర్చించారు. దీర్ఘకాలిక వ్యాధులు, అధునాతన వైద్య పద్ధతులపై కీ నోట్ స్పీచ్‌లు, ప్రజెంటేషన్లు నిర్వహించారు. శనివారం బీచ్ రోడ్డులో వాకథాన్‌ను నిర్వహించగా, వందలాది మంది వైద్యులు, నగరవాసులు పాల్గొన్నారు.

కిలాడీ లేడీలకు అరదండాలు

పెందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, బస్సుల్లో ప్రయాణికుల మాదిరిగా రాకపోకలు సాగిస్తూ మహిళల ఆభరణాలు, నగదు, ఇతర వస్తువులను చోరీ చేస్తున్న కిలాడీ లేడీలను శనివారం పెందుర్తి నేర విభాగ పోలీసులు అరెస్టు చేశారు. క్రైమ్ ఎస్ఐ డి సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట విద్యానగర్‌కు చెందిన జ్యోతి అనే మహిళ ఈ నెల ఐదున ఆటోలో ఎన్ఏడీ నుంచి వేపగుంట ప్రయాణిస్తుండగా అదే ఆటోలో ఇద్దరు మహిళలు ఎక్కారు. వేపగుంటలో జ్యోతి దిగేసరికి తన హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచిన రూ.23 వేల నగదు, సెల్ ఫోన్ మాయమయ్యాయి. అలాగే మల్కాపురం జనతా కాలనీకి చెందిన కోసూరు లక్ష్మి గాజువాక నుంచి పెందుర్తికి బస్సులో వస్తుండగా తన సూట్‌కేస్‌లో గల హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదని, అందులో 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.ఐదు వేల నగదు, వెండి పట్టీలు ఉన్నట్టు ఈ నెల నాలుగున పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళల ఫిర్యాదుల మేరకు ఎస్ఐ సూరిబాబు దర్యాప్తు చేపట్టి ఆయా ప్రాంతాల్లో గల సీసీ పుటేజీలను పరిశీలించారు. బాధితులు తెలిపిన మహిళల ఆనవాళ్లను ఆధారంగా చేసుకుని చోరీలకు పాల్పడింది పాత నేరస్తులేనని గుర్తించారు. దీంతో విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల పార్వతి (35), మేకల గంగ (45) అనే ఇద్దరి మహిళా దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద న ఉంచి 12 తులాల బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్, రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులా.. టీడీపీ కార్యకర్తలా?

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మీడియాతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'పోలీస్ ఉద్యోగం చేస్తున్నారా? లేకపోతే టీడీపీ కార్యకర్తల మాదిరిగా పనిచేస్తున్నారా? పోస్టింగుల కోసమో.. కూటమి నేతల ప్రాపకం కోసం వారు చెబుతున్నట్టు చేస్తున్నారా' అంటూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పోలీసులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం జగన్‌తో పాటు వైసీపీ నాయకులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేసేందుకు వైసీపీ నేతలతో కలిసి శనివారం ఆయన సీపీ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో సీపీ అందుబాటులో లేకపోవడంతో డీసీపీ-1 అజితా వేజెండ్లను కలిసి ఫిర్యాదును అందజేశారు. అనంతరం అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పినప్పటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు, అరెస్టులు మొదలయ్యాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 'గాజువాక'కు చెందిన వెంకటేశ్ యాదవ్, తూర్పు నియోజకవర్గానికి చెందిన రమణారెడ్డి, 'భీమిలి'కి చెందిన లోకేశ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. అక్రమ కేసులకు తాము భయపడేది లేదని అమర్‌నాథ్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంబా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.